సాక్షి అనకాపల్లి

శుక్రవారం । 12 । మే । 2023



చిన్నారుల దత్తత

విశాఖ: ప్రభుత్వ శిశుగృహలో పెరిగిన ఇద్దరు పిల్లలను బెంగళూరు, ఒంగోలు ప్రాంతాలకు చెందిన వారు దత్తత తీసుకున్నారు.



అప్పన్నకు స్వర్ణ పుష్పార్చన

సింహాచలం: శ్రీవరాహ లక్ష్మీనృసింహస్వామికి గురువారం స్వర్ణపుష్పార్చన ఘనంగా నిర్వహించారు.



కనకమ్మ సన్నిధిలో..

విశాఖ: కనకమహాలక్ష్మి అమ్మవారిని ఆర్‌టీఐ కమిషనర్ జి.జనార్ధనరావు దంపతులు గురువారం దర్శించుకున్నారు.

న్యూస్‌రీల్

ఇండోర్ స్టేడియం అభివృద్ధికి చర్యలు

- కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి



ఇండోర్ స్టేడియం స్థలాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి

పరవాడ: గొర్లివానిపాలెం జేఎన్‌ఎన్‌యూఆర్ఎం సమీపంలోని ఇండోర్ స్టేడియం అభివృద్ధికి చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి అధికారులను ఆదేశించారు. ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్ ఇటీవల కలెక్టర్‌ను కలిసి ఇండోర్ స్టేడియం స్థలాన్ని అభివృద్ధి చేయాలని కోరారు. దీంతో కలెక్టర్ గురువారం పరిశీలనకు వచ్చారు. స్టేడియంకు కేటాయించిన స్థలానికి హద్దులు నిర్ణయించడంతో పాటు పెరిగిన తుప్పలు, డొంకలు తొలగించాలని సూచించారు. అసంపూర్తిగా ఉన్న నిర్మాణాలను పూర్తి చేయడానికి చర్యలు చేపట్టాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. కలెక్టర్ వెంట రాష్ట్ర సీఈసీ సభ్యుడు పైల శ్రీనివాసరావు, పరవాడ జెడ్పీటీసీ పైల సన్యాసిరాజు, గొర్లివానిపాలెం సర్పంచ్ గొర్లి గోపి అమ్మలు, ఎంపీడీవో వి.హేమసుందర్రావు, తహసీల్దార్ వి.ప్రకాశరావు, శాప్ అధికారులు పాల్గొన్నారు.

ఆదివాసీ గర్భిణి ఆస్పత్రికి తరలింపు



కిల్లో చిన్నికి సూచనలు చేస్తున్న ఆరోగ్య సిబ్బంది

రావికమతం: ఆస్పత్రికి రానంటూ పంతం పట్టిన చీమలపాడు పంచాయతీ శివారు ఆదివాసీ గ్రామానికి చెందిన హైరిస్క్ నిండు గర్భిణిని ఆరోగ్య సిబ్బంది ఎట్టకేలకు పీహెచ్‌సీకి తరలించారు. నేరేడుబందలో ఉంటున్న కిల్లో చిన్నికి ఇది ఆరవ కాన్పు. ఆమె పరిస్థితి హైరిస్క్‌లో ఉంది. పలు పరీక్షలు చేసి తగిన మందులు వేసుకోవాల్సి ఉంది. అయితే ఆమె ఆస్పత్రికి ససేమిరా రానంటూ పట్టుబట్టడంతో కొత్తకోట పీహెచ్‌సీ సూపర్‌వైజర్లు, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు, సిబ్బంది ఆ గ్రామం వెళ్లి ఆమెకు పలు విధాలుగా నచ్చచెప్పి ఎట్టకేలకు కొత్తకోట ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించారు. వైద్య పరీక్షలు చేసి మందులిచ్చారు.

స్టీల్‌ప్లాంట్ నూతన డైరెక్టర్ బాధ్యతల స్వీకరణ



సురేష్ చంద్ర పాండే

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ నూతన డైరెక్టర్(పర్సనల్)గా డాక్టర్ సురేష్ చంద్ర పాండే గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఇంతవరకు ఆయన సెయిల్ సేలం యూనిట్ చీఫ్ జనరల్ మేనేజర్(పీఅండ్ఏ)గా విధులు నిర్వర్తించారు. రాంచీ యూనివర్సిటీలో కామర్స్, ఎల్ఎల్‌బీలో గ్రాడ్యుయేషన్ పూర్తి చేసిన పాండే 1989లో సెయిల్‌లో చేరారు. బుద్ధ గయలోని మగధ్ విశ్వవిద్యాలయంలో ఎంబీఏ పూర్తి చేసిన తర్వాత ఆయన పర్సనల్ మేనేజ్‌మెంట్‌లో పీహెచ్‌డీ పొందారు. పాండే బాధ్యతలు స్వీకరించిన అనంతరం సీఎండీ అతుల్ భట్, ఇతర డైరెక్టర్లను మర్యాదపూర్వకంగా కలిశారు.

పలు రైళ్లు ఆలస్యం

తాటిచెట్లపాలెం: చెన్నైలో గురువారం రాత్రి 7.15 గంటలకు బయలుదేరాల్సిన చెన్నై సెంట్రల్–హౌరా(12840) మెయిల్ రెండున్నర గంటలు ఆలస్యంగా రాత్రి 9.45 గంటలకు బయలుదేరింది. విశాఖపట్నంలో మధ్యాహ్నం 2 గంటలకు బయలుదేరాల్సిన విశాఖపట్నం–కడప(17488) తిరుమల ఎక్స్‌ప్రెస్ రెండు గంటలు ఆలస్యంగా సాయంత్రం 4 గంటలకు బయలుదేరింది. పెయిరింగ్ రైళ్లు ఆలస్యంగా చేరుకోవడంతోనే ఈ పరిస్థితి ఏర్పడిందని రైల్వే అధికారులు తెలిపారు.

పారిశ్రామికవేత్తల నుంచి దరఖాస్తుల ఆహ్వానం

తుమ్మపాల : ప్రధాన మంత్రి ఉపాధి కల్పనా పథకంలో వివిధ పరిశ్రమల్ని నెలకొల్పేందుకు ఔత్సాహిక పారిశ్రామికవేత్తల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు రాష్ట్ర ఖాదీ, గ్రామీణ పరిశ్రమల మండలి సహాయ సంచాలకులు డాక్టర్ వి.పద్మ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉత్పత్తి పరిశ్రమలకు రూ.50 లక్షలు, సేవా పరిశ్రమలకు రూ.20 లక్షల వరకు వివిధ బ్యాంకుల ద్వారా రుణ సౌకర్యం పొందే అవకాశం ఉందన్నారు. కనీసం 8వ తరగతి చదివి, 18 ఏళ్లు దాటిన వారు దరఖాస్తు చేసుకోవడానికి అర్హులన్నారు. వివరాల కోసం అనకాపల్లి కలెక్టరేట్‌లో ఉన్న ఖాదీ గ్రామీణ పరిశ్రమల మండలి కార్యాలయంలోగానీ, 7396749236, 9441724353 ఫోన్ నంబర్లలో గానీ సంప్రదించవచ్చన్నారు.

విశ్వ విశాఖే లక్ష్యంగా..



వైఎస్సార్ స్టేడియంలో సంతకం చేస్తున్న సీఎం జగన్

- రూ.49 కోట్ల విలువైన ప్రాజెక్టులు ప్రారంభించిన సీఎం జగన్
- రూ.24.86 కోట్లతో భీమిలి ఫిషింగ్ జెట్టీకి శంకుస్థాపన
- మహానేత వైఎస్సార్ విగ్రహావిష్కరణ
- అపోలో ఆస్పత్రిలో అత్యాధునిక క్యాన్సర్ సేవలు ప్రారంభం
- సీఎం జగన్‌కు ఘన స్వాగతం పలికిన నగరవాసులు



వైఎస్సార్ స్టేడియంలో ఫొటోగ్యాలరీని పరిశీలిస్తున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి



సీ హారియర్ యుద్ధ విమాన మ్యూజియంను తిలకిస్తూ..

సాక్షి, విశాఖపట్నం/విశాఖ స్పోర్ట్స్: మహా నగరానికి ఉజ్వల భవిష్యత్ అందించడమే లక్ష్యంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గురువారం నగరంలో సుడిగాలి పర్యటన చేశారు. కార్యనిర్వాహక రాజధానిగా అభివృద్ధి చేసేందుకు అవసరమైన మౌలిక వసతులు కల్పించడంతో పాటు, క్రీడా, వైద్య, పర్యాటకంగా, వ్యాపార కేంద్రంగా, మత్స్య మణిహారంగా, విభిన్న కేంద్రాలకు చిరునామాగా మార్చేందుకు వడివడిగా అడుగులు వేయాలన్న సంకల్పంతో ముఖ్యమంత్రి పర్యటన సాగింది. మొత్తంగా రూ.49 కోట్ల విలువైన ప్రాజెక్టులను ప్రారంభిస్తూ రూ.24.86 కోట్ల పనులకు శంకుస్థాపన చేశారు. వలసలాంధ్రగా మారిన ఉత్తరాంధ్రకు రాజధాని తీసుకొస్తున్న ముఖ్యమంత్రికి ప్రజలు అడుగడుగునా నీరాజనం పలికారు.

క్రీడల రాజధానిగా..

మధ్యాహ్నం 3.30 గంటలకు విశాఖ విమానాశ్రయానికి చేరుకున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి.. అక్కడి నుంచి హెలికాప్టర్‌లో వైఎస్సార్ ఏసీఏ–వీడీసీఏ క్రికెట్ స్టేడియంకు చేరుకున్నారు. దివంగత నేత వైఎస్ రాజశేఖర్‌రెడ్డి విగ్రహాన్ని ఆవిష్కరించారు. విశాఖను క్రీడా రాజధానిగా అభివృద్ధి చేసే దిశగా అడుగులు వేస్తూ కీలక కార్యక్రమాలకు శ్రీకారం చుట్టారు. యువ క్రీడాకారులకు ప్రభుత్వం సహకరిస్తోందని భరోసా ఇచ్చారు. వైఎస్సార్ స్టేడియంలో ఏర్పాటు చేసిన ఫొటో ఎగ్జిబిషన్‌ను తిలకించారు. ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఆంధ్ర ప్రీమియర్ లీగ్ సీజన్–2 లోగో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా అండర్–19 మహిళా ప్రపంచ వరల్డ్ కప్‌లో భారత్‌కు ఏపీ తరపున ప్రాతినిధ్యం వహించిన షబ్నం, అంజలి శర్వాణీని అభినందించారు. వారికి రూ.10 లక్షల చొప్పున అందించి సత్కరించారు. మరిన్ని విజయాలతో ఆంధ్రకు మంచి పేరుతేవాలని సూచించారు. క్రీడలు, క్రీడాకారుల అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక ప్రణాళిక రూపొందిస్తోందని వెల్లడించారు. ఆంధ్ర తరఫున రంజీ మ్యాచ్‌లాడిన క్రికెటర్లకు ప్రభుత్వం అన్నివిధాల సహకారం అందిస్తుందని భరోసా ఇచ్చారు. ప్రతిభ ఉన్న క్రీడాకారులను గుర్తించి, వారి అభ్యున్నతే లక్ష్యంగా రోడ్ మ్యాప్ తయారుచేసి ప్రభుత్వానికి అందజేయాలని ఏసీఏ అపెక్స్ కౌన్సిల్ కార్యదర్శి గోపినాథ్‌రెడ్డి, ఉపాధ్యక్షుడు రోహిత్‌రెడ్డి, సంయుక్త కార్యదర్శి రాకేష్, సీఈవో శివారెడ్డి, ట్రెజరర్ పురుషోత్తంకు సీఎం జగన్ సూచించారు. అనంతరం స్టేడియంలో ఫొటోగ్యాలరీని ప్రారంభించిన సీఎం వైఎస్ జగన్.. స్వీయ దస్తూరితో సంతకం చేశారు. ఏసీఏ అపెక్స్ కౌన్సిల్,



తన చిత్రాన్నే జ్ఞాపికగా..

వీడీసీఏ, పలు క్లబ్‌లకు చెందిన ప్రతినిధులతో ఆయన ఫొటో సెషన్‌లో పాల్గొన్నారు.

ఇండోర్ స్టేడియంతో క్రీడా వసతులు

జీవీఎంసీ స్మార్ట్ సిటీ నిధులతో రూ.25.50 కోట్లతో ఎంవీపీ కాలనీలో నిర్మించిన ఇండోర్ స్పోర్ట్స్ ఎరీనాను ముఖ్యమంత్రి ప్రారంభించారు. విశాఖలో ఉన్న క్రీడాకారులకు పూర్తి వసతులతో కూడిన ఈ స్టేడియాన్ని అంకితం చేశారు. బాస్కెట్‌బాల్, వాలీబాల్, బ్యాడ్మింటన్ కోర్టులతో పాటు యోగా, జిమ్, స్విమ్మింగ్.. ఇలా భిన్నమైన వసతులను నగర క్రీడాకారులకు అందించారు.

వ్యాపార కేంద్రంగా విశాఖ

వాణిజ్య కేంద్రంగా భాసిల్లుతున్న విశాఖకు వచ్చే వారికి.. ప్రతి ఒక్కటి అందుబాటులో ఉండేలా వ్యాపారాలు విస్తరింపజేస్తే నగరం ఆర్థికంగా బలోపేతం కావడంతో పాటు ఉపాధి అవకాశాలు, స్వయం ఉపాధికి దారులు చూపెడతాయని, దానికనుగుణంగా చర్యలు చేపట్టాలని సీఎం అధికారులకు సూచించారు. ఇందులోభాగంగా వీఎంఆర్‌డీఏ ఆధ్వర్యంలో రామ్‌నగర్‌లో రూ.13.50 కోట్లతో నిర్మించిన కమర్షియల్ కాంప్లెక్స్‌ను ప్రారంభించారు.

కలల జెట్టీకి.. శంకుస్థాపన

భీమిలి వద్ద రూ.24.86 కోట్లతో నిర్మించనున్న ఫిషింగ్ జెట్టీకి ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి శంకుస్థాపన చేశారు. ఈ జెట్టీ నిర్మాణానికి రూ.14.91 కోట్లు కేంద్ర ప్రభుత్వం అందిస్తుండగా.. మిగిలిన మొత్తాన్ని రాష్ట్ర ప్రభుత్వం భరించడమే కాకుండా.. మౌలిక వసతులు కల్పించే బాధ్యతను భుజానికెత్తుకుంది. మత్స్యకారుల బతుకుల్లో వెలుగులు నింపేందుకు ఈ భీమిలి జెట్టీ నిర్మాణానికి అవసరమైన ప్రణాళికలు త్వరితగతిన సిద్ధం చేయాలని అధికారులకు సీఎం జగన్ ఆదేశించారు.

నీరాజనం

ముఖ్యమంత్రి రాకకు ముందుగానే.. 'వైజాగ్ స్టాండ్స్ విత్ యూ.. థాంక్యూ సీఎం సర్' అనే హోర్డింగులతో స్వచ్ఛందంగా స్వాగతం పలికిన ఉత్తరాంధ్ర ప్రజలు.. గురువారం కూడా అదే రీతిలో నీరాజనం పలికారు. పీఎంపాలెంలోని క్రికెట్ స్టేడియం వద్ద.. సీఎం జగన్‌ను చూసేందుకు ప్రజలు పోటీపడ్డారు. ముఖ్యమంత్రి స్టేడియం వద్దకు చేరుకోగానే 'థాంక్యూ సీఎం సర్' అనే నినాదంతో మధురవాడ మార్మోగింది. బీచ్‌రోడ్డులో సీహారియర్ మ్యూజియం వద్ద కూడా సీఎంను చూసేందుకు వచ్చిన ప్రజల నుంచి అదే స్పందన కనిపించింది. సీఎం అందరికీ ఆత్మీయ అభివాదం చేస్తూ అక్కడ నుంచి విమానాశ్రయానికి బయలుదేరివెళ్లారు.

బీచ్‌కు మణిహారం

బీచ్‌రోడ్డులో రూ.10 కోట్లతో ఏర్పాటు చేసిన సీ హారియర్ యుద్ధ విమాన మ్యూజియాన్ని సీఎం జగన్ ప్రారంభించి పర్యాటకులకు అందుబాటులోకి తీసుకొచ్చారు. యుద్ధ విమాన విడిభాగాలతో సిమ్యులేటర్స్ ప్రత్యేక ఆకర్షణగా ఉన్న మ్యూజియం బీచ్‌కు మణిహారంగా మారుతుందని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా సీహారియర్ మ్యూజియాన్ని దాదాపు 5 నిమిషాల పాటు పరిశీలించారు. సీ హారియర్‌లోని ప్రతి ఒక్క భాగం గురించి తూర్పు నౌకాదళాధిపతి వైస్ అడ్మిరల్ బిస్వజిత్‌దాస్ గుప్తా వివరించారు. టీయూ–142, కురుసుర సబ్‌మెరైన్, సీహారియర్ మ్యూజియాన్ని ఇంటిగ్రేట్ చేయాలని వీఎంఆర్‌డీఏ అధికారులను సూచించారు. బీచ్‌కు వచ్చే ప్రతి పర్యాటకుడు ఈ మూడు మ్యూజియాలను సందర్శించేలా అభివృద్ధి చేయాలని సీఎం సూచించారు.



ముఖ్యమంత్రికి స్వాగతం పలుకుతున్న డిప్యూటీ సీఎం ముత్యాలనాయుడు, జెడ్పీటీసీ సభ్యురాలు అనురాధ

ఆరోగ్య విశాఖ..



అపోలో క్యాన్సర్ ఆసుపత్రిని ప్రారంభించిన సీఎం వైఎస్ జగన్

విశాఖ ప్రజలకు అంతర్జాతీయ స్థాయి సాంకేతికత, మౌలిక సదుపాయాలతో కూడిన అధునాతన వైద్య వ్యవస్థలు అందుబాటులోకి రావడం శుభపరిణామమని సీఎం వైఎస్ జగన్ అన్నారు. దివంగత వైఎస్ రాజశేఖర్‌రెడ్డి హయాంలో ప్రారంభమైన ఆరిలోవ హెల్త్‌సిటీలో ఉన్న అపోలో హాస్పిటల్‌లో 54 వేల చ.అడుగుల విస్తీర్ణంలో ఏర్పాటు చేసిన అత్యాధునిక క్యాన్సర్ కేంద్రాన్ని ప్రారంభించారు. ట్రూ బీమ్ ఎస్‌టీఎక్స్ టెక్నాలజీ కలిగిన ఏపీలోనే మొట్టమొదటి, ఏకైక క్యాన్సర్ కేంద్రాన్ని విశాఖలో ఏర్పాటు చేయడంపై అపోలో గ్రూప్స్ చైర్మన్ డా.ప్రతాప్ సి రెడ్డి, ఎగ్జిక్యూటివ్ వైస్ చైర్‌పర్సన్ డా.ప్రీతారెడ్డిని అభినందించారు.





మహిళా క్రికెటర్లు షబ్నం, అంజలి శర్వాణీలకు నగదు ప్రోత్సాహకాలు అందిస్తున్న సీఎం వైఎస్ జగన్

నేటి నుంచి పాలిటెక్నిక్ వార్షిక పరీక్షలు

మురళీనగర్: పాలిటెక్నిక్ విద్యార్థులకు వార్షిక పరీక్షలు శుక్రవారం నుంచి నిర్వహిస్తామని కంచరపాలెం ప్రభుత్వ కెమికల్ ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.వెంకటరమణ తెలిపారు. పరీక్షలు ఈనెల 27వ తేదీ వరకు నిర్వహిస్తారు. సీ–20 సిలబస్‌కు సంబంధించి ఫస్టియర్ వార్షిక పరీక్షలతో పాటు సెకండియర్ థర్డ్ సెమిస్టర్ సప్లమెంటరీ, ఫోర్త్ సెమిస్టర్ రెగ్యులర్, సప్లమెంటరీ పరీక్షలు నిర్వహిస్తామన్నారు. ఉదయం పరీక్ష 9.30 గంటల నుంచి 12.30గంటలకు, మధ్యాహ్నం పరీక్ష రెండు గంటల నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు నిర్వహిస్తారు.

అసాంఘిక కార్యకలాపాలపై ఉక్కుపాదం


- జిల్లా వ్యాప్తంగా ఒకే రోజులో 619 మందిపై కేసులు
- చలానాలు, స్వాధీనం చేసుకున్న నగదు రూ.98,750

అనకాపల్లి టౌన్ : జిల్లాలో అసాంఘిక కార్యకలాపాలపై పోలీసులు ఉక్కుపాదం మోపారు. గురువారం ఒక్కరోజులోనే 619 మందిపై కేసులు నమోదు చేశారు. వారి నుంచి చలానాలు, ఇతర మార్గాల్లో రూ.98,750 వసూళ్లు చేశారు. జిల్లా ఎస్పీ కె.వి.మురళీకృష్ణ గురువారం మీడియాకు వివరాలు వెల్లడించారు. మద్యం, ఇసుక, గంజాయి, కోడిపందాలు, జూదం తదితర అసాంఘిక కార్యకలాపై దాడులు నిర్వహించి కేసులు నమోదు చేసినట్టు తెలిపారు.

- జూదం ఆడుతున్న ఐదుగురు వ్యక్తుల నుంచి రూ.2,350లు స్వాధీనం చేసుకుని. వారిపై కేసులు నమోదు చేశారు.
- అక్రమంగా సారా విక్రయిస్తున్న సమాచారంతో దాడి చేసి, 9 లీటర్ల సారా స్వాధీనం చేసుకున్నారు. ముగ్గురిపై కేసు నమోదు చేశారు.
- బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించి, ప్రజా శాంతికి భంగం కలిగించిన కేసుల్లో 50 మందిని పట్టుకున్నారు.
- మద్యం సేవించి వాహనాలు నడుపుతున్న 13 మంది, ట్రిపుల్ రైడింగ్ కేసుల్లో 23 మందిని అదుపులోకి తీసుకున్నారు.
- మోటార్ వెహికల్ నిబంధనలు ఉల్లంఘించిన 525 మందిపై కేసులు నమోదు చేసి, వారి నుంచి రూ.96,400 ఈ చలానాలు కట్టించినట్లు ఎస్పీ వెల్లడించారు.

ఏయూకు పేటెంట్ మంజూరు

- రీసెర్చ్ టీమ్‌ను అభినందించిన వీసీ ఆచార్య ప్రసాదరెడ్డి



పేటెంట్ ఉత్తర్వులను అందజేస్తున్న వీసీ ప్రసాదరెడ్డి

ఎంవీపీకాలనీ (విశాఖ తూర్పు): మెటల్ ఫ్రీ హైడ్రోజన్ సెన్సార్ అండ్ మెథడ్ ఆఫ్ ఫ్యాబ్రికేషన్ అంశంపై ఆంధ్రవిశ్వవిద్యాలయం కెమిస్ట్రీ విభాగం జరిపిన పరిశోధనల ఆవిష్కరణకు పేటెంట్ లభించింది. ఈ మేరకు భారత కంట్రోలర్ ఆఫ్ పేటెంట్స్ ఉత్తర్వులు జారీ చేసింది. ఈ వివరాలను ఏయూ వీసీ ఆచార్య పీవీజీడీ ప్రసాదరెడ్డి వెల్లడించారు. ఏయూ కెమిస్ట్రీ విభాగం ద్వారా ఆచార్య కె.సురేష్ బాబు, ఆచార్య బసవయ్యతో పాటు పలువురు విద్యార్థులు కలిసి ఈ పరిశోధనలు చేసినట్లు తెలిపారు. ఈ అప్లికేషన్ హైడ్రోజన్ ఎకానమీ వృద్ధిలో ఉపయోగపడుతుందన్నారు. ఈ ఆవిష్కరణ మెటల్ రహిత హైడ్రోజన్ సెన్సార్, హైడ్రోకార్బన్, ఇతర ప్రాసెసింగ్ పరిశ్రమలలో సేవలకు ఉపయుక్తంగా ఉంటుందని తెలిపారు. ఈ పేటెంట్ పొందడంతో సెంటర్ ఫర్ ఇంటలెక్చువల్ ప్రాపర్టీ రైట్స్ చైర్ హెడ్ ఆచార్య పురుసోత్తంను అభినందించారు. ఈ పరిశోధక ఆవిష్కరణకు కేవలం 11 నెలల్లోనే పేటెంట్ మంజూరు చేయడం అభినందనీయమన్నారు. సైన్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య శ్రీనివాసరావు, ఆచార్య పురుషోత్తం, ఆచార్య బసవయ్య, పరిశోధకులు నాని, కృష్ణవేణి తదితరులు పాల్గొన్నారు.

రీ సర్వే దేశానికే రోల్ మోడల్

- వందేళ్ల తర్వాత భూములకు హక్కు, రక్షణ కల్పన ప్రక్రియ
- ప్రతి అంగుళం కొలిచి హద్దుల నిర్ధారణ
- యజమానులకు పక్కాగా హక్కుపత్రాలు
- జిల్లాలో చకచకా రెండో విడత సర్వే
- తొలి విడతలో 143 గ్రామాల్లో రీసర్వే
- రెండో విడతలో 220 గ్రామాల్లో శరవేగంగా..
- 'సాక్షి'తో జాయింట్ కలెక్టర్ జాహ్నవి



జాయింట్ కలెక్టర్ జాహ్నవి

సాక్షి, అనకాపల్లి: దేశంలో వందేళ్ల తర్వాత నిర్వహిస్తున్న 'భూముల రీసర్వే' ప్రాజెక్టు దేశానికే రోల్ మోడల్ కానుందని జాయింట్ కలెక్టర్ ఎం.జాహ్నవి అన్నారు. గురువారం ఆమె 'సాక్షి'తో ముఖాముఖి మాట్లాడారు. 'వైఎస్సార్ జగనన్న శాశ్వత భూహక్కు–భూ రక్ష' పథకం కింద జిల్లాలో రెండో విడత భూముల రీ సర్వే ప్రక్రియ శరవేగంగా జరుగుతోందని ఆమె పేర్కొన్నారు. ప్రధానంగా సర్వే రికార్డులను సిద్ధం చేయడం, అవసరమైన రెవెన్యూ పత్రాలను అందుబాటులో ఉంచుకోవడం, భూ హక్కు పత్రాలను తయారు చేయడం, వెబ్‌లాండ్ 2.0లో నమోదు చేయడం, హద్దు రాళ్లు నాటడం, సచివాలయాల్లో రిజిస్ట్రేషన్లు వంటి ఆరు దశలపై ప్రత్యేక దృష్టి సారించి ఎక్కడా ఇబ్బందులు లేకుండా రీ సర్వే చేపడుతున్నామన్నారు. ప్రజల ఆస్తులకు భరోసా కల్పించాలనే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా రీ సర్వే చేపట్టిందన్నారు. ఇంకా ఆమె ఏమన్నారంటే..

అణువణువూ లెక్కగడతాం..

రీసర్వేలో మిల్లీమీటర్లతో సహా కొలిచి మ్యాప్ రూపొందిస్తారు. ప్రతి రెవెన్యూ విలేజ్ పరిధిలో విలేజ్ మ్యాప్ ఉంటుంది. ప్రతి ఒక్కరి భూమికి ఆధార్ నంబర్ మాదిరిగా యూనిక్ ఐడీ నంబర్ కేటాయిస్తారు. ఆ నంబర్‌తో భూమి ఎక్కడ ఉందో, సరిహద్దులు ఏమిటో సర్వే ద్వారా అంగుళాలతో సహా నిర్ధారణ అవుతుంది. మొదటి విడతలో దొర్లిన తప్పులు రెండో విడతలో ఎదురవ్వకుండా అధికారులు క్షేత్రస్థాయిలో జాగ్రత్తలు తీసుకుంటున్నారు.


నెలాఖరుకు రెండో విడతలో 150 గ్రామాలు పూర్తి చేస్తాం

జిల్లాలో 733 రెవెన్యూ గ్రామాలున్నాయి. అందులో 45 గ్రామాలు జీవీఎంసీ, ఏపీఐఐసీ, ఫార్మాసిటీ పరిధిలో ఉన్నాయి. మిగతా 688 గ్రామాలకుగానూ మొదటి విడతలో 143 గ్రామాల్లో రీ సర్వే పూర్తయింది. ఈ గ్రామాలకు ఎల్‌పీఎం కూడా పూర్తయింది. ఇప్పటివరకు 127 గ్రామాలకు సంబంధించి 45,242 జగనన్న భూ హక్కు పత్రాలు పంపిణీ చేశాం. రెండో విడతలో 220 గ్రామాల్లో సుమారు 207052.37 ఎకరాల్లో రీ సర్వే ప్రారంభించడం జరిగింది. వీటిలో ఇప్పటివరకు 30 గ్రామాల్లో 19,659.315 ఎకరాల్లో రీ సర్వే పూర్తయింది. వీటికి ఫైనల్ ఆర్ఓఆర్ కూడా ప్రచురించాం. మిగిలిన 190 గ్రామాల రీ సర్వే ప్రస్తుతం జరుగుతోంది. మే నెలాఖరు నాటికి 150 గ్రామాలు పూర్తి చేయాలని లక్ష్యం నిర్దేశించుకున్నాం.

అన్‌సెటిల్డ్ రెవెన్యూ గ్రామాలపై దృష్టి

జిల్లాలో 18 వరకు అన్‌సెటిల్డ్ రెవెన్యూ విలేజ్‌లున్నాయి. ఆ గ్రామాలపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నాం. నాతవరం మండలంలో సరుగుడు, కృష్ణాపురం, సమచింత, కె.శరభవరం గ్రామాలు, సబ్బవరం మండలంలో దొంగలమర్రి సీతారాంపురం, మాడుగుల, చీడికాడ మండలాల్లో పలు రెవెన్యూ గ్రామాలు ఉన్నాయి. ఇప్పటికే ఆ గ్రామాల్లో సర్వేపై వినతులు వచ్చాయి.

విశాఖ పోర్టు సరికొత్త రికార్డు



దొండపర్తి(విశాఖ దక్షిణ): విశాఖ పోర్ట్ అథారిటీ సరికొత్త రికార్డును నమోదు చేసింది. ఇప్పటి వరకు కార్గో రవాణాలో దూసుకుపోతున్న పోర్టు.. తాజాగా రవాణా నౌకల యాంకరింగ్ విషయంలో తన సత్తా చాటింది. ఈ నెల 1వ తేదీ నుంచి 10వ తేదీ వరకు 75 వెసెల్స్‌ను విశాఖ పోర్టులో నిలిపారు. వేగవంతమైన కార్గో హ్యాండ్లింగ్, సమగ్రమైన ప్రణాళికతో మునుపెన్నడూ లేని విధంగా పెద్ద సంఖ్యలో నౌకలకు బెర్తులు కేటాయించడంలో.. అధికారులు, ఉద్యోగులు, సిబ్బంది కృషిని పోర్టు ఉన్నతాధికారులు ప్రశంసించారు.

స్టార్టప్‌లలో రెట్టింపు పెట్టుబడులు

దొండపర్తి(విశాఖ దక్షిణ): ఆంధ్రప్రదేశ్ స్టార్టప్స్‌లో పెట్టుబడులు కోవిడ్ కంటే ముందుతో పోల్చుకుంటే రెట్టింపు అయ్యాయని ఐటీ అసోసియేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ అధ్యక్షుడు శ్రీధర్ కొసరాజు తెలిపారు. స్టార్టప్‌లను ప్రోత్సహిస్తూ వారికి అవసరమైన పెట్టుబడుల కల్పనకు బాటలు వేసేందుకు సక్సీడ్ ఇండోవేషన్ ఫండ్ సహకారంతో ఏపీ స్టార్టప్స్ అండ్ డీప్ టెక్ ఇండియా ఆధ్వర్యంలో గురువారం టెక్ మహీంద్రా కార్యాలయంలో ఉన్న టెక్‌హబ్‌లో స్టార్టప్ ఇన్వెస్ట్‌మెంట్ మాస్టర్ క్లాస్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో 30 మంది ఇన్వెస్టర్లు, ఐటీ, ఎంటర్‌టైన్‌మెంట్, ఫార్మా, కన్‌స్ట్రక్షన్, మానుఫ్యాక్చరింగ్, షిపింగ్ రంగాల నుంచి పెట్టుబడులు ఆశించే స్టార్టప్ ప్రతినిధులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా శ్రీధర్ కొసరాజు మాట్లాడుతూ స్టార్టప్స్‌లో పెట్టుబడులు ద్వారా అధిక రిటర్న్స్ వస్తుండడంతో చాలా మంది ఇన్వెస్టర్లు నూతన స్టార్టప్‌లలో ఇన్వెస్ట్ చేసేందుకు ఆసక్తి చూపిస్తున్నారని చెప్పారు. డీప్ టెక్ స్టార్టప్స్‌లో పెట్టుబడులు పెట్టేందుకు ఈ సమావేశం తొలి అడుగు అని పేర్కొన్నారు. కార్యక్రమంలో సక్సీడ్ ఇండోవేషన్ ఫండ్ జనరల్ పార్టనర్స్ రమేష్ లోకనాథన్, విక్రాంత్ వర్షే పాల్గొని స్టార్టప్స్‌ను ప్రోత్సహించేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందిస్తున్న సహకారాన్ని వివరించారు.

క్లుప్తంగా

నేడు విజయవాడలో శ్రీలక్ష్మీ మహాయజ్ఞం

అనకాపల్లి టౌన్‌: సీఎం వైఎస్‌ జగన్‌మోహన్‌ రెడ్డి సంకల్పంతో విజయవాడ ఇందిరాగాంధీ మున్సిపల్‌ స్టేడియంలో ఈ నెల 12 నుంచి 17వ తేదీ వరకూ అష్టోత్తర శతకుండాత్మక ఛండీరుద్ర, రాజశ్యామల సుదర్శన సహిత శ్రీలక్ష్మీ మహాయజ్ఞం నిర్వహిస్తున్నట్లు జిల్లా దేవదాయ శాఖాధికారి సీపాన రాజారావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర సర్వతోముఖాభివృద్ధి, రాష్ట్ర ప్రజల సంక్షేమం, శాంతి సౌభాగ్యాల కోసం ఈ క్రతువు నిర్వహిస్తున్నామన్నారు. డిప్యూటీ సీఎం, దేవదాయ శాఖ మంత్రి కొట్టు సత్యనారాయణ, దేవదాయ శాఖ కమిషనర్‌ శ్రీరాము సత్యనారాయణ పర్యవేక్షణలో కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. రోజూ ఉదయం మండప పూజలు, కలశారాధన, అభిషేకాలు, హోమాలు, సాయంత్రం ప్రసిద్ధ దేవాలయాల స్వామివార్లకు కల్యాణోత్సవాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. భక్తులు పాల్గొన్ని స్వామివారి ప్రసాదాన్ని స్వీకరించాలని కోరారు.

వివాదాస్పద క్వారీ పరిశీలన



క్వారీని పరిశీలిస్తున్న సీఐ రమణయ్య

మాకవరపాలెం: వివాదాస్పదంగా మారిన నల్లరాతి క్వారీని నర్సీపట్నం రూరల్‌ సీఐ రమణయ్య పరిశీలించారు. మండంలోని జి.కోడూరు రెవెన్యూలోని సర్వే నంబర్‌ 332లో లీజుకు ఇచ్చిన క్వారీని తెరవొద్దంటూ సమీప రైతులు ఇటీవల ఫిర్యాదు చేశారు. ఈ నేపథ్యంలో గురువారం సీఐ ఈ క్వారీని పరిశీలించి వివరాలు తెలుసుకున్నారు. ఆయన వెంట ఎస్‌ఐ రామకృష్ణారావు ఉన్నారు.

రెండో రోజు రైతుల ఆందోళన...

జి.కోడూరులో లీజుకిచ్చిన క్వారీ అనుమతి రద్దు చేయాలని రైతులు బుధవారం నుంచి క్వారీ ప్రాంతంలో ఆందోళన చేపట్టారు. ఈ ఆందోళన రెండో రోజు కొనసాగింది. క్వారీ నిర్వహిస్తే సమీప భూములకు ఇబ్బందులు ఎదురవుతాయని వాపోయారు. వీరికి వ్యవసాయ కార్మిక సంఘంతోపాటు కేవీపీఎస్‌ నేతలు మద్దతు తెలిపారు.

ఎన్‌ఎస్‌టీఎల్‌లో ముగిసిన జాతీయ సాంకేతిక దినోత్సవం

- 95 శాతం క్షిపణులు, టార్పిడోలు దేశీయంగానే తయారు కావడం గర్వకారణం
- డైరెక్టర్‌ శ్రీనివాసరావు

గోపాలపట్నం: ఎన్‌ఎస్‌టీఎల్‌లో మూడు రోజులుగా జరుగుతున్న సాంకేతిక దినోత్సవ వేడుకలు గురువారంతో ఘనంగా ముగిసాయి. సంస్థ డైరెక్టర్‌ వై. శ్రీనివాసరావు తొలుత అబ్దుల్‌ కలామ్‌ విగ్రహానికి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శాస్త్రవేత్తలు, సాంకేతిక నిపుణుల నిరంతర కృషితో ఎన్‌ఎస్‌టీఎల్‌ అభివృద్ధిపథాన దూసుకుపోతుందని అన్నారు. 95 శాతం క్షిపణులు, టార్పిడోలు దేశీయంగానే తయారు కావడం మనకు గర్వకారణం అన్నారు. ఈ ఓపెన్‌ హౌస్‌ ప్రదర్శనను 6,200 మందికి పైగా విద్యార్థులు సందర్శించారని తెలిపారు. ప్రొఫెసర్‌ డీవీఎల్‌ఎన్‌ సోమయాజులు అధునాతన వ్యవస్థల అభివృద్ధి, గ్రోబల్‌ టెక్నాలజీ ప్రాముఖ్యతను వివరించారు. డాక్టర్‌ జీఎస్‌ రావు లాఫింగ్‌ బుద్ధా అనే కోడ్‌ నేమ్‌తో ఆపరేషన్‌ శక్తిని మే 1998లో, మిషన్‌ శక్తిని 2019లో ఎలా అమలు చేశారో వివరించారు. ఎన్‌ఎస్‌టీఎల్‌ సైంటిస్ట్‌ ఆనంద్‌కుమార్‌కు టైటానియం అవార్డును డైరెక్టర్‌ శ్రీనివాసరావు అందించారు. 'బెస్ట్‌ టార్పిడో రిలీజ్‌ మెకానిజం'అనే అంశంపై చేసిన ప్రసంగానికి ఆయన ఈ మెడల్‌ దక్కించుకున్నారు.



వైజ్ఞానిక ప్రదర్శనలో ప్రథమ బహుమతి అందుకుంటున్న విద్యార్థులు

వైజ్ఞానిక ప్రదర్శనలో విద్యార్థులకు బహుమతులు

జాతీయ సైన్స్‌డే సందర్భంగా ఏర్పాటు చేసిన వైజ్ఞానిక ప్రదర్శనలో గెలుపొందిన వారికి బహుమతులు అందించారు. సృజనవాణి వాలంటరీ అసోసియేషన్‌ ద్వారా విద్యార్థులు చేపట్టిన ఐవోటీ బేస్డ్‌ స్మార్ట్‌ అగ్రికల్చర్‌ మానిటరింగ్‌ సిస్టమ్‌ ప్రాజెక్ట్‌కు మొదటి బహుమతి వచ్చింది. విద్యార్థులు టి. తేజస్విని, వై. జస్వంత్‌కు జ్ఞాపికలు, ప్రశంసాపత్రాలు అందించారు. రెండో బహుమతి రివర్‌ రాగ్‌ రిమూవర్‌కు, మూడో బహుమతి ఆక్వాపోనిక్స్‌ ప్రాజెక్టుకు దక్కాయి. కళాశాల విభాగంలో దాడి ఇనిస్టిట్యూట్‌ ఆఫ్‌ ఇంజినీరింగ్‌ కళాశాల విద్యార్థులు జి. జయశంకర్‌రెడ్డి, ఎ. దినేష్‌కుమార్‌ రూపొందించిన లైట్‌ ట్రాన్స్‌మిటింగ్‌ కాంక్రీట్‌ బ్రిక్‌ మొదటి బహుమతి దక్కించుకుంది. రెండు బహుమతులు విజ్ఞాన్‌ కళాశాల విద్యార్థులు పొందారు. ఈ కార్యక్రమంలో సీనియర్‌ శాస్త్రవేత్తలు పీవీఎస్‌ గణేష్‌కుమార్‌, బీవీఎస్‌ఎస్‌ కృష్ణకుమార్‌, శాస్త్రవేత్తలు ఉద్యోగులు, సిబ్బంది పాల్గొన్నారు.



జ్యోతి ప్రజ్వలనతో కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న ఎన్‌ఎస్‌టీఎల్‌ డైరెక్టర్‌ శ్రీనివాసరావు

ప్రేమ వ్యవహారంలో ఘర్షణ

- యువకుడికి తీవ్ర గాయాలు

చోడవరం రూరల్‌ : ప్రేమ వ్యవహారంలో ఘర్షణ జరిగి కత్తితో ఓ యువకుడిని తీవ్రంగా గాయపరిచిన ఉదంతమిది. కేసు దర్యాప్తు చేస్తున్న చోడవరం ఎస్‌ఐ ఎ.సూర్యనారాయణ కథనం ప్రకారం వివరాలిలా ఉన్నాయి. మండలంలోని అడ్డూరు గ్రామానికి చెందిన శానబోయిన దేముడు బాబు(27) గవరవరం గ్రామానికి చెందిన యువతిని ప్రేమించాడు. అయితే ఆ యువతికి మూడు నెలల క్రితం మరో వ్యక్తితో వివాహం జరిగింది. ఈ విషయమై మాట్లాడాలని యువతికి వరుసకు బావ అయిన నర్సాపురానికి చెందిన సబ్బి రమణ, యువతి సోదరుడు బోరా దేముడుబాబు అడ్డూరు మజ్జి గౌరమ్మ గుడి సమీపంలోని కొండ వద్దకు రావాలని యువతి ప్రేమికుడు దేముడుబాబుకు గురువారం మధ్యాహ్నం కబురు పంపారు. అక్కడ వీరి మధ్య మాటామాటా పెరగడంతో మేకలకు మేత కొమ్మలు కోయడానికి తెచ్చుకున్న కత్తితో ప్రేమికుడిపై దాడి చేశారు. దీంతో శానబోయిన దేముడుబాబుకు వీపుపై తీవ్రంగా గాయమైంది. గాయంతో విలవిలలాడుతున్న అతనిని వదలిపెట్టి వారిద్దరూ పరారయ్యారు. గాయపడిన దేముడు బాబు గ్రామానికి చేరుకోవడంతో బంధువులు అతన్ని విశాఖపట్నం విమ్స్‌ ఆస్పత్రికి తరలించారు. బాధితుడి తల్లి రమణమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్‌ఐ సూర్యనారాయణ తెలిపారు.



గాయపడిన దేముడుబాబు (ఇన్‌సెట్‌లో ఫైల్‌)

తండ్రి అంత్యక్రియలకు వెళ్తూ కొడుకు దుర్మరణం

నక్కపల్లి : తండ్రి అంత్యక్రియలకు వెళుతూ కొడుకు రోడ్డు ప్రమాదంలో దుర్మరణం పాలయిన ఘటన నక్కపల్లి వద్ద గురువారం జరిగింది. వివరాలిలా ఉన్నాయి. పశ్చిమ గోదావరి జిల్లా తాడేపల్లిగూడేనికి చెందిన లోకానాథ్‌ ప్రతాప్‌రాజు (48) అనకాపల్లి జిల్లా లంకెలపాలెంలో ప్రయివేట్‌ కంపెనీలో పని చేస్తున్నాడు. కుటుంబంతో అక్కడే ఉంటున్నాడు. బుధవారం రాత్రి ఇతని తండ్రి తాడేపల్లి గూడెంలో అనారోగ్యంతో చనిపోయాడు. ఈ విషయం తెలిసిన ప్రతాప్‌రాజు ఉదయాన్నే కుటుంబ సభ్యులను రైలెక్కించి కొడుకు సుదీర్‌కుమార్‌ (15)తో కలిసి మోటార్‌ సైకిల్‌పై తాడేపల్లి గూడెం బయలుదేరారు. నక్కపల్లి వద్ద బైక్‌ అదుపు తప్పి డివైడర్‌ను ఢీకొట్టడంతో ప్రతాప్‌రాజు తల, ముఖానికి తీవ్ర గాయాలై రక్తస్రావం అయింది. స్థానికులు నక్కపల్లి ఏరియా ఆస్పకి తరలించగా, అక్కడికి వెళ్లే లోగా మృతి చెందాడు. బైక్‌పై అతనితో పాటు ప్రయాణిస్తున్న కుమారుడికి స్వల్ప గాయాలయ్యాయి. ప్రమాద విషయం మృతుని కుటుంబ సభ్యులకు తెలిసింది. కళ్ల ముందే కన్న తండ్రి మరణించడం చూసి కొడుకు కన్నీరు మున్నీరుగా విలపిస్తున్నాడు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్‌ఐ శిరీష తెలిపారు.



ప్రతాప్‌రాజు (ఫైల్‌)



ప్రతాప్‌రాజు మృతదేహం



గాయాలపాలైన కొడుకు సుధీర్‌

జిల్లాలో నాగులాపల్లి పీఏసీఎస్‌ ఆదర్శం

- నాబార్డు చీఫ్‌ జనరల్‌ మేనేజర్‌ మోహన్‌ అయ్య

మునగపాక: మండలంలోని నాగులాపల్లి ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘం (పీఏసీఎస్‌) జిల్లాలోనే ఆదర్శంగా నిలుస్తుందని నాబార్డు చీఫ్‌ జనరల్‌ మేనేజర్‌ మోహన్‌ అయ్య తెలిపారు. గురువారం ఆయన ఇక్కడ సంఘం కార్యాలయంలోని అన్ని గదులను పరిశీలించారు. అనంతరం సంఘం ద్వారా అందుతున్న సేవలను అడిగి తెలుసుకున్నారు. రైతులకు సొసైటీ ద్వారా అందుతున్న సేవలతోపాటు డివిడెండ్‌ సదుపాయం, ఫంక్షన్‌ హాలు ఏర్పాటు తదితర సేవల పట్ల హర్షం వ్యక్తం చేశారు. సహకార సంఘ పరిధి తోటాడలో రూ.40 లక్షలతో నిర్మించిన గోదామును పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంఘ సేవలను విస్తృతం చేయడంతోపాటు తోటాడ గోదాములో మౌలిక సదుపాయాలు కల్పిస్తామన్నారు. అనంతరం చీఫ్‌ జనరల్‌ మేనేజర్‌ను సంఘ ప్రతినిధులు శాలువాతో సత్కరించారు. ఆయన వెంట జిల్లా కేంద్ర సహకార బ్యాంక్‌ అసిస్టెంట్‌ జనరల్‌ మేనేజర్‌ ఏం.శ్రీనివాసరావు, సూపర్‌వైజర్‌ శ్రీరామమూర్తి, సంఘ అధ్యక్షుడు మళ్ల ఉమామహేశ్వరరావు, పాలకవర్గ సభ్యులు నరాలశెట్టి బాబూరావు, కొయిలాడ ఎర్రయ్యనాయుడు, సంఘ సీఈవో మళ్ల సోమచంద్రనాయుడు ఉన్నారు.



నాబార్డు చీఫ్‌ జనరల్‌ మేనేజర్‌ మోహన్‌ అయ్యను సత్కరిస్తున్న దృశ్యం

పురుగుమందు తాగిన వ్యక్తి మృతి

మునగపాక : మండలంలోని పల్లపు ఆనందపురం వ్యవసాయ క్షేత్రంలో మూడు రోజుల క్రితం పురుగు మందు తాగిన రైతు విశాఖ కేజీహెచ్‌లో చికిత్స పొందుతూ గురువారం మృతి చెందారు. వివరాలు ఇలా ఉన్నాయి. అచ్యుతాపురం మండలం కాశీపాలెం గ్రామానికి చెందిన ద్వారపూడి సూరిబాబు(54) వ్యవసాయం సాగు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. తనకు తరచూ కాళ్ల నొప్పులు ఎక్కువ కావడాన్ని భరించలేక ఈ నెల 8వ తేదీన సమీపంలోని పల్లపు ఆనందపురంలో తన వ్యవసాయ క్షేత్రంలో పురుగు మందు తాగి అపస్మారక స్థితికి చేరుకున్నాడు. స్థానికులు గుర్తించి అతనిని విశాఖ కేజీహెచ్‌కు తరలించారు. మూడు రోజుల పాటు చికిత్స పొందుతూ సూరిబాబు గురువారం మృతి చెందారు. ఈ మేరకు మునగపాక పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు. మృతుడు సూరిబాబుకు భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు.

వృద్ధుడి అదృశ్యంపై ఫిర్యాదు

కోటవురట్ల: మండలంలో ఏఎస్‌పేటకు చెందిన కూర్మసల సూకరాజు(73) అదృశ్యంపై ఫిర్యాదు అందినట్టు ఎస్‌ఐ నారాయణరావు గురువారం తెలిపారు. అతని శరీరంపై తెలుపు రంగు లాల్చీ, లుంగీ, మెడలో తెలుపురంగు తువ్వాలు ఉన్నాయన్నారు. ఆచూకీ తెలిసినవారు స్థానిక పోలీస్‌ స్టేషన్‌కు సమాచారం అందివ్వాలన్నారు.

వైద్య విద్యార్థుల మౌన దీక్ష

మహారాణిపేట : కేరళలో వైద్యుల సమ్మెకు మద్దతుగా, వైద్యురాలు వందనా దాస్‌ మృతికి సంతాపంగా గురువారం సాయంత్రం వైద్య విద్యార్థులు మౌన దీక్ష చేపట్టారు. తొలుత ఆంధ్రా మెడికల్‌ కాలేజీ నుంచి కేజీహెచ్‌ సూపరింటెండెంట్‌ కార్యాలయం వరకు ప్రదర్శన చేశారు. నల్ల రిబ్బన్లు ధరించి మౌన దీక్షలో పాల్గొన్నారు. విధి నిర్వహణలో ఉన్న వైద్యురాలు వందనా దాస్‌ను చంపిన వారిని కఠినంగా శిక్షించాలని, ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా కఠిన చర్యలు తీసుకోవాలని ఏపీ జూనియర్‌ డాక్టర్స్‌ అసోసియేషన్‌ జిల్లా అధ్యక్షుడు డాక్టర్‌ కరుణా ప్రశాంత మామిడి కోరారు. అసోసియేషన్‌ ప్రధాన కార్యదర్శులు ఎస్‌ఎండీ ఇలియాజ్‌ బాషా, డాక్టర్‌ చైతన్య కుమార్‌, డాక్టర్లు తదితరులు పాల్గొన్నారు.

పంచాయతీ అవకతవకలపై డీపీవో విచారణ

కశింకోట : మండలంలోని ఏఎస్‌ పేట పంచాయతీలో ఆర్థిక ఆరోపణలపై స్పందనలో వచ్చిన ఫిర్యాదు ఆధారంగా జిల్లా పంచాయతీ అధికారి శిరీషారాణి గురువారం విచారణ జరిపారు. స్థానికుడైన ముప్పిడి వెంకటేష్‌ స్పందనలో ఇటీవల జిల్లా కలెక్టర్‌ రవి పట్టాన్‌శెట్టికి ఫిర్యాదు చేశారు. సిమెంట్‌ ఫ్యాక్టరీ కారణంగా సమీపంలోని తన పంట భూమిలో దిగుబడి రావట్లేదని, పరిహారం విషయంలో పరిశ్రమతో కార్యదర్శి లాలూచీపడ్డారని తన ఫిర్యాదులో ఆరోపించినట్టు తెలిసింది. ఈ నేపథ్యంలో కలెక్టర్‌ ఆదేశాల మేరకు పంచాయతీ రికార్డులను డీపీవో పరిశీలించారు. అనంతరం ఆ రికార్డులను సీజ్‌ చేశారు. ఫిర్యాదుదారు ఆరోపణలపై పంచాయతీ కార్యదర్శి సత్యారావును విచారించారు. ఈ విచారణలో ఎంపీడీవో కొంకి అప్పారావు, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.



ఏఎస్‌ పేట పంచాయతీ కార్యాలయంలో విచారణ జరుపుతున్న డీపీవో శిరీషారాణి

సాక్షి క్లాసిఫైడ్స్

ఆర్థిక ఇబ్బందులతో వ్యక్తి ఆత్మహత్య

చోడవరం రూరల్‌ : కుటుంబ సమస్యలు, ఆర్థిక బాధలతో ఓ వ్యక్తి పురుగు మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. చోడవరం ఎస్‌ఐ సూర్యనారాయణ అందించిన వివరాలిలా ఉన్నాయి. పట్టణ శివారు అన్నవరం వెంకయ్యగారిపేటకు చెందిన మృతుడు పొట్నూరి హరి మల్లికార్జున కుమార్‌(37) ఎలక్ట్రీషియన్‌గా పనిచేస్తూ, రియల్‌ఎస్టేట్‌ వ్యాపారులకు సహకరిస్తూ వారిచ్చే కమిషన్‌తో జీవించేవాడు. ఇతనికి భార్య దేవి, ఇద్దరు పిల్లలు ఉన్నారు. కొంత కాలం క్రితం మరో యువతిని వివాహం చేసుకున్నాడు. వీరిద్దరికీ ఆరునెలల పాప సంతానం. ఆర్థిక ఇబ్బందులతో ఫైనాన్సియర్‌ వద్ద లక్ష రూపాయల మేరకు అప్పు చేశాడు. రెండు కుటుంబాలను పోషించడం, అప్పు వాయిదాలు చెల్లించడం భారం కావడంతో మూడు నెలలుగా ఇంటికి సైతం వెళ్లకుండా నిత్యం మద్యం సేవిస్తూ ఉండేవాడు. ఈ నేపథ్యంలో గురువారం ఉదయం రేవళ్ల గ్రామానికి వెళ్లే దారిలో మామిడితోటలో హరి విగతజీవిగా పడి ఉండడాన్ని చూసిన కొందరు అతని కుటుంబ సభ్యులకు తెలిపారు. మృతుడి భార్య దేవి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని పంచనామా జరిపి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్‌ఐ తెలిపారు. హరి పురుగుమందు తాగి ఆత్మహత్యకు పాల్పడినట్టుగా ప్రాథమిక దర్యాప్తులో వెల్లడైందన్నారు.



మృతుడు హరి

ప్రమాదంలో గాయపడిన బాలుడి మృతి

నక్కపల్లి : జాతీయ రహదారిపై సారిపల్లిపాలెం సమీపంలో బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడిన బాలుడు సుధీర్‌లాజర్‌(6) విశాఖపట్నంలో చికిత్స పొందుతూ గురువారం మరణించాడు. వివరాలివి. బుధవారం సాయంత్రం సారిపల్లిపాలెం సమీపంలో పెదతీనార్లకు రాంగ్‌ రూట్లో వెళ్తున్న ఆటోని వ్యాన్‌ ఢీకొట్టిన సంగతి తెలిసిందే. ఈ ఘటనలో ఆటో వెళ్లి వెనుక వస్తున్న బైక్‌ను ఢీకొట్టడంతో బైకుపై ప్రయాణిస్తున్న నక్కపల్లి ఎస్సీ కాలనీకి చెందిన ఆర్‌ఎంపీ వైద్యుడు పాస్టర్‌ అయిన కిరణ్‌ కుటుంబం తీవ్ర గాయాలపాలైంది. ఈ ఘటనలో కిరణ్‌కొడుకు సుధీర్‌ లాజర్‌ తీవ్రంగా గాయపడి పరిస్థితి విషమంగా ఉండడంతో విశాఖపట్నం కేజీహెచ్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ బాలుడు మరణించినట్టు పోలీసులు తెలిపారు.



మరణించిన సుధీర్‌ లాజర్‌

ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు ఉచిత శిక్షణ

కంచరపాలెం: పోటీ పరీక్షలకు సిద్ధమయ్యే ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు ప్రభుత్వ బాలికల పారిశ్రామిక శిక్షణ సంస్థ ప్రాంగణంలోని జాతీయ కెరీర్‌ సర్వీస్‌ సెంటర్‌ ఫర్‌ ఎస్సీ, ఎస్టీ ఆధ్వర్యంలో ఉచిత శిక్షణ ఇవ్వనున్నారు. ఈ మేరకు సబ్‌ రీజినల్‌ ఉపాధి కార్యాలయం అధికారి శ్యాంసుందర్‌ నిట్టాల ఓ ప్రకటన విడుదల చేశారు. 18–27 ఏళ్ల మధ్య వయసు ఉండి, ఇంటర్‌ ఆపైన కోర్సులు చదివిన అభ్యర్థులు శిక్షణకు అర్హులన్నారు. ఈ ఏడాది పరీక్షలకు హాజరైన అభ్యర్థులు కూడా దరఖాస్తు చేసుకోవచ్చని సూచించారు. ఎంపికైన వారికి నెలకు రూ.1000 స్టైఫండ్‌తో పాటు ఉచిత శిక్షణ ఇస్తామన్నారు. దరఖాస్తుదారుల తల్లిదండ్రుల వార్షిక ఆదాయం రూ.3లక్షలకు మించరాదన్నారు. ఈ నెల 15లోగా నేషనల్‌ కెరీర్‌ సర్వీస్‌ సెంటర్‌ పోర్టల్‌ https://ncs.gov.inలో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

పరారైన గంజాయి నిందితుడు అరెస్టు

ముంచంగిపుట్టు : గంజాయి రవాణా కేసులో గతంలో పరారైన నిందితుడిని ముంచంగిపుట్టు పోలీసులు పట్టుకున్నారు. ఎస్‌ఐ రవీంద్ర విలేకరులకు అందించిన వివరాలిలా ఉన్నాయి. గురువారం సాయంత్రం మండల కేంద్రం నుంచి జోలాపుట్టు వెళ్లే మార్గంలో పోలీసులు తనిఖీలు నిర్వహిస్తూ ఉండగా కించాయిపుట్టు నుంచి మండల కేంద్రానికి కాలినడకన వస్తున్న యువకుడు పోలీసులను చూసి పారిపోవడానికి ప్రయత్నించాడు. దీనిని గమనించిన పోలీసులు అతనిని పట్టుకొని విచారించారు. 2022లో జోలాపుట్టు పంచాయతీ లబ్బూరు జంక్షన్‌ వద్ద 684 కిలోల గంజాయి రవాణా కేసులో పరారైన నిందితుడు బోండ్రుగూడ గ్రామానికి చెందిన బి.రవిగా గుర్తించారు. అప్పట్లో ఈ కేసులో ఇద్దరిని అరెస్టు చేయగా రవి పరారయ్యాడు. గురువారం అతడు పట్టుబడడంతో అరెస్టు చేసి కోర్టుకు తరలించడం జరిగిందని ఎస్‌ఐ రవీంద్ర తెలిపారు.



గంజాయి నిందితుడు రవితో ముంచంగిపుట్టు పోలీసులు

బస్సు ఢీకొని ఒకరికి గాయాలు

రాంబిల్లి : సెజ్‌లో యూనిపార్ట్స్‌ కంపెనీ సమీపంలో గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో అప్పన్నపాలేనికి చెందిన ఎస్‌.సత్యనారాయణ గాయపడినట్టు ఎస్‌ఐ దీనబంధు తెలిపారు. బైక్‌పై వెళ్తున్న సత్యనారాయణను బస్సు ఢీకొట్టడంతో ఈ ప్రమాదం జరిగిందన్నారు. ఈ ప్రమాదంలో బాధితుడి కాలు ఫ్రాక్చర్‌ కావడంతో విశాఖపట్నం కిమ్స్‌ ఆసుపత్రికి తరలించారని, కేసు దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌ఐ తెలిపారు.

త్వరితగతిన పీహెచ్‌సీల అభివృద్ధి పనులు



పనులు పరిశీలిస్తున్న ఈఈ రమేష్‌

గొలుగొండ: ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో అభివృద్ధి పనులు త్వరితగతిన నాణ్యతా ప్రమాణాలతో చేపట్టాలని ఉమ్మడి విశాఖ జిల్లా ఆర్‌అండ్‌బీ ఈఈ రమేష్‌ తెలిపారు. ఆయన గురువారం గొలుగొండ, కృష్ణదేవిపేట పీహెచ్‌సీల్లో అభివృద్ధి పనులు పరిశీలించారు. ఈ పనుల కోసం ప్రభుత్వం రూ.1.50 కోట్లు మంజూరు చేసిందన్నారు. పనుల నాణ్యతతోపాటు సకాలంలో పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని దిగువ స్థాయి సిబ్బందికి ఆదేశాలు జారీ చేశారు. కార్యక్రమంలో నర్సీపట్నం డీఈఈ సిద్ధార్థప్రభు, జేఈ ప్రసాద్‌, నర్సీపట్నం మార్కెట్‌ యార్డు చైర్మన్‌ చిటికెల భాస్కర నాయుడు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ఆగి ఉన్న వాహనాన్ని ఢీకొన్న వ్యాన్‌ : డ్రైవర్‌ మృతి

అనకాపల్లిటౌన్‌: మండలంలో శంకరం జాతీయ రహదారిలో ఆగి ఉన్న వాహనాన్ని వ్యాన్‌ ఢీ కొనడంతో వ్యాన్‌ డ్రైవర్‌ అక్కడిక్కడే మృతి చెందాడు. గ్రామీణ ఏఎస్‌ఐ అర్జున కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. సాలూరుకు చెందిన తిమింగలిరెడ్డి శ్రీనివాసరావు బుధవారం రాత్రి సాలురు నుంచి రావులపాలెం వ్యాన్‌లో వ్యవసాయ సామగ్రితో రావులపాలెం బయలు దేరాడు. అనకాపల్లి మండలం శంకరం గ్రామం జాతీయ రహదారికి వచ్చేసరికి ముందు ఆగి ఉన్న వాహనాన్ని ఢీకొన్నాడు. ఈ ఘటనలో డ్రైవర్‌ శ్రీనివాసరావు అక్కడికక్కడే మృతి చెందాడు. విషయం తెలుసుకున్న శ్రీనివాసరావు సోదరుడు విశ్వనాథం సంఘటన స్థలానికి చేరుకుని మృతదేహాన్ని ఎన్టీఆర్‌ వైద్యాలయానికి తరలించారు. విశ్వనాథం ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఏఎస్‌ఐ చెప్పారు.

అనుమతులు లేని టేకు కలప పట్టివేత

నర్సీపట్నం : పర్మిట్‌ లేకుండా సామిల్లుకు తరలించిన టేకు కలపను అటవీ అధికారులు గురువారం పట్టుకున్నారు. డీఎఫ్‌వో రాజారావుకు వచ్చిన ముందస్తు సమాచారం మేరకు పెట్రోలింగ్‌ సిబ్బంది తామరం శివశక్తి సామిల్లులో టేకు కలపతో వ్యాన్‌ను పట్టుకోవడం జరిగిందని రేంజర్‌ లక్ష్మీనర్సు తెలిపారు. కోటవురట్ల మండలం చౌడువాడ గ్రామానికి చెందిన మడగల రమణ అనుమతులు లేకుండా కలపను సామిల్లుకు తీసుకురావడం జరిగిందన్నారు. రమణపై కేసు నమోదు చేశామన్నారు. వ్యాన్‌లోని 14 టేకు దుంగలను స్వాధీనం చేసుకుని వ్యాన్‌ సీజ్‌ చేశామన్నారు. పట్టుబడిన కలప విలువ రూ.25,299 ఉంటుందన్నారు.



అటవీ అధికారులు టేకు కలపతో పట్టుకున్న వ్యాన్‌

దేవరాపల్లిలో పశువులపాక, గడ్డి వాము దగ్ధం



కాలిన గాయాలతో మైసూరు ఎద్దు



బాధిత రైతును పరామర్శిస్తున్న మాజీ ఎంపీపీ కిలపర్తి భాస్కరరావు

- కాలిన గాయాలతో అపస్మారక స్థితిలో ఎద్దు, పాడి ఆవు
- రూ.3 లక్షల మేర ఆస్తి నష్టం అంచనా

దేవరాపల్లి : దేవరాపల్లి శివారు శంభువానిపాలెం సమీపంలోని కొల్లి వారి కల్లాలు వద్ద బుధవారం అర్ధరాత్రి జరిగిన అగ్ని ప్రమాదంలో కొల్లి సన్యాసి నాయుడుకు చెందిన పశువుల పాక, గడ్డి వాము దగ్ధమైంది. ఈ ప్రమాదంలో మైసూరు ఎద్దు, పాడి ఆవు కాలిన గాయాలతో అపస్మారక స్థితిలో ఉన్నాయి. మైసూరు ఎద్దును ఇటీవల రూ.లక్షా 30 వేలుకు కనుగోలు చేశాడు. వెరసి సుమారు రూ.3లక్షల మేర ఆస్తి నష్టం వాటిల్లినట్టు బాధిత కుటుంబ సభ్యులు అంచనా వేస్తున్నారు. అర్ధరాత్రి సమయంలో ప్రమాదం జరగడంతో సమీపంలో జరగగా స్థానికులు కొందరు సమాచారం ఇవ్వడంతో అక్కడికి చేరుకోగా అప్పటికే పశువుల పాక, గడ్డివాము పూర్తిగా అగ్ని ఆహుతయ్యాయి. సమీపంలోని ధాన్యం పురికి మంటలు వ్యాపించకుండా మంటలు అదుపు చేశారు. ప్రమాదంలో కాలిన పశువులకు దేవరాపల్లి పశువైద్యాధికారి ఎస్‌.అలేఖ్య తన సిబ్బందితో కలిసి వైద్య సేవలందించారు. ఎస్‌ఐ డి.నాగేంద్ర, మహిళ పోలీస్‌ జి.వరలక్ష్మి ప్రమాదానికి కారణాలను అడిగి తెలుసుకున్నారు. ప్రమాదానికి విద్యుత్‌ సార్ట్‌ సర్క్యూట్‌ కారణం అయి ఉంటుందని భావిస్తున్నారు.

మాజీ ఎంపీపీ భాస్కరరావు 5వేలు ఆర్థికసాయం

అగ్ని ప్రమాద విషయాన్ని తెలుసుకున్న మాజీ ఎంపీపీ కిలపర్తి భాస్కరరావు బాధిత రైతు కొల్లి సన్యాసినాయుడును గురువారం పరామర్శించారు. ప్రమాద వివరాలను అడిగి తెలుసుకొని రూ.5 వేలు నగదు సహాయాన్ని అందజేశారు. ప్రమాద విషయం డిప్యూటీ సీఎం బూడి ముత్యాల నాయుడుకు దృష్టికి ఫోన్‌ ద్వారా తెలియజేశారు. బాధిత కుటుంబానికి ప్రభుత్వం నుంచి సాయం అందించేలా చొరవ తీసుకుంటామని డిప్యూటీ సీఎం చెప్పారని భాస్కరరావు తెలిపారు.

ఆటోలో తరలిస్తున్న 230 కిలోల గంజాయి పట్టివేత

- ఇద్దరు నిందితులకు రిమాండ్‌, ఆటో సీజ్‌

పెదబయలు : మండలంలోని రూడకోట జంక్షన్‌లో ఆటోలో తరలిస్తున్న 230 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకోవడం జరిగిందని ఎస్‌ఐ పులి మనోజ్‌కుమార్‌ తెలిపారు. గురువారం రూడకోట జంక్షన్‌లో పోలీసులు వాహన తనిఖీలు చేస్తుండగా పెదబయలు మండలం మారుమూల జామిగుడ నుంచి కమడ మీదుగా ఆటోలో ఇద్దరు వ్యక్తులు గంజాయితో వస్తూ పోలీసులకు గమనించి ఆటో రోడ్డు పక్కన ఆపి పరుగు తీశారు. దీంతో వారిని వెంబడించి పట్టుకున్న పోలీసులు ఆటోలో గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. గంజాయిని ఒడిశా బెజ్జింగి సరిహద్దు గ్రామాల నుంచి కొనుగోలు చేసి విశాఖ తీసుకువెళ్లి సరఫరా చేస్తున్నట్టు నిందితులు తెలిపారన్నారు. జి మాడుగుల మండలం కె. కోడాపల్లి పంచాయతీ కొత్తఊరు గ్రామానికి చెందిన కొర్ర ప్రసాద్‌, హుకుంపేట గన్నేరుపుట్టు గ్రామానికి చెందిన వంతాల సూరిబాబు లను అదుపులో తీసుకుని కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించడం జరిగిందని ఎస్‌ఐ మనోజ్‌కుమార్‌ తెలిపారు. ఏపీఎస్‌పీ పోలీసులు పాల్గొన్నారు.



పెదబయలులో గంజాయి, నిందితులతో ఎస్‌ఐ, పోలీసు సిబ్బంది

క్లుప్తంగా

సత్యనారాయణపురంలో 'గడప గడపకు' నేడు

అనకాపల్లిటౌన్ : గడప గడపకు మనప్రభుత్వం కార్యక్రమం మండలంలోని సత్యనారాయణపురంలో శనివారం ఉదయం 8 గంటల నుంచి నిర్వహించనున్నట్లు ఎంపీపీ గొర్లి సూరిబాబు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్య, ఐటీశాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ హాజరుకానున్నట్లు పేర్కొన్నారు. మండలంలో సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, వార్డు మెంబర్లు, వివిధ ప్రభుత్వశాఖ అధికారులు, సచివాలయం ఉద్యోగులు, వలంటీర్లు, పార్టీ స్థానిక నాయకులు పాల్గొనాల్సిందిగా కోరారు.

మిద్దె పంటలపై అవగాహన రేపు

అనకాపల్లిటౌన్ : అనకాపల్లి గ్రీన్ క్లబ్ ఆధ్వర్యంలో గవరపాలెం గౌరీగ్రంథాలయం హాల్లో శనివారం సాయంత్రం 5 గంటలకు ×మేడలపై కూరగాయలు–తోటల పెంపకం ₹పై అవగాహన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు క్లబ్ వ్యవస్థాపకుడు కొణతాల ఫణిభూషణ్‌శ్రీధర్ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా బయోటెక్నాలజీ శాస్త్రవేత్త డాక్టర్ కె.జయచంద్ర విచ్చేయనున్నట్లు పేర్కొన్నారు. మిద్దె పంటల సాగుపై ఆసక్తి ఉన్నవారు హాజరుకావాల్సిందిగా కోరారు.

ఘనంగా మరిడిమాంబ పండగ



హోమంలో పాల్గొన్న భక్తులు

అనకాపల్లిటౌన్ : మండలంలోని మారేడుపూడి గ్రామదేవత మరిడిమాంబ అమ్మవారి పండగ గురువారం ఘనంగా జరిగింది. తెల్లవారుజాము నుంచి చుట్టుప్రక్కల గ్రామాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్ని అమ్మవారిని దర్శించుకున్నారు. ప్రత్యేక పూజలు చేసి మొక్కులు తీర్చుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ అధ్యక్షుడు యర్ర రాము, గ్రామ సర్పంచ్ సాలాపు కనకరాజులు మాట్లాడుతూ వేసవిని దృష్టిలో పెట్టుకుని ఆలయానికి వచ్చే భక్తులకు ఉచిత మజ్జిగ, తాగునీటి, ఆలయ సమీపంలో భక్తులకు టెంట్లు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. సాయంత్రం పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ కార్యదర్శి రేబాక ప్రసాద్, ఎంపీటీసీ అప్పలరాజు, భక్తులు పాల్గొన్నారు.

బెల్లం ధరలు



అనకాపల్లి మార్కెట్‌కు గురువారం 500 బెల్లం దిమ్మలు వచ్చాయి.

దిమ్మల రకం	కనిష్ట ధర	గరిష్ట ధర
స్పెషల్ రకం	-----	-----
మొదటి రకం	4,340	5,190
రెండో రకం	3,920	4,200
మూడో రకం	3,290	3,890

అనకాపల్లి సినిమాలు

కస్టడీ	రాజా
రామబాణం	సత్యనారాయణ స్క్రీన్-1
గార్డియన్స్ ఆఫ్ ది గెలాక్సీ (తెలుగు 3డి)	సత్యనారాయణ స్క్రీన్-2
పీఎస్-2	షిర్డీసాయి
విరూపాక్ష	పర్తిసాయి
కల్యాణమస్తు	వెంకటేశ్వర
ఉగ్రం	శ్రీసత్య
ఏజెంట్	రామచంద్ర

రక్త నిల్వలు

అనకాపల్లిటౌన్ : జిల్లా ఎన్టీఆర్ వైద్యాలయ రక్తనిధి కేంద్రంలో 133 యూనిట్ల రక్తం నిల్వ ఉంది. ఏ పాజిటివ్-10 యూనిట్లు, బీ పాజిటివ్-42 యూనిట్లు, ఓ పాజిటివ్-81 యూనిట్లు శుద్ధి చేసిన రక్తం నిల్వ ఉంది. అవసరమైన వారు వైద్యాలయ బ్లడ్‌బ్యాంకు ప్రతినిధి గంగయ్య(9848418400)ను సంప్రదించవచ్చు.

గ్యాస్ సమాచారం

అనకాపల్లిటౌన్ : ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ద్వారా గురువారం 367 మంది గ్యాస్ బుక్ చేసుకున్నారు. గతంలో బుక్ చేసుకున్న వారిలో 305 మందికి సిలిండర్లు సరఫరా చేశారు. వివరాలకు ఇండేన్‌గ్యాస్ ఏజెన్సీ(9441108144)ని సంప్రదించవచ్చు.

నిబంధనలు 'కాల్చే'స్తున్నారు!



కాల్చడానికి సిద్ధం చేసిన ఇటుకలు



సీతానగరం సమీపంలో ఇటుక బట్టీ నుంచి వెలువడుతున్న పొగ

- అనుమతుల్లేకుండా ఇటుక బట్టీల నిర్వహణ
- చెరువులు, ప్రభుత్వ భూముల్లో మట్టి తవ్వకాలు
- నాలా పన్ను ఎగవేత.. ప్రభుత్వ ఆదాయానికి గండి
- వెంకుపాలెంలో ఓ బట్టీకి రూ.40 లక్షలు జరిమానా!

మూడేళ్ల క్రితం ఇటుక ధర రూ.5 మాత్రమే. ఇప్పుడు గరిష్టంగా రూ.9 వరకూ పలుకుతోంది. సిమెంట్, ఫ్లైయాష్ ఇటుకలు అందుబాటులోకి వచ్చినా మట్టి ఇటుకల పైనే ఎక్కువ మంది ఆసక్తి చూపుతున్నారు. దీంతో ఇటుకల వ్యాపారానికి డిమాండ్ ఏర్పడింది. ఎక్కడికక్కడ యజమానులు ఇటుక బట్టీలు ఏర్పాటు చేస్తూ నిబంధనలు బేఖాతరు చేస్తున్నారు.

అనకాపల్లి రూరల్ : పచ్చని పొలాలు ఇటుక బట్టీలుగా మారిపోతున్నాయి. చెరువులు, సమీపంలోని జలాశయాల్లో మట్టి తరలిపోతోంది. పట్టా, ప్రభుత్వ భూమి అనే తేడా లేకుండా మట్టి తవ్వకాలు జోరుగా సాగుతున్నాయి. ఎలాంటి అనుమతులు లేకుండా బట్టీలకు అగ్గి పెడుతున్నారు. ఫలితంగా కాలుష్యానికి కారకులవుతున్నారు. నిబంధనలకు విరుద్ధంగా గ్రామాల్లో నిర్వహిస్తున్న ఇటుక బట్టీలపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

మండలంలో 50 వరకు బట్టీలు

అనకాపల్లి మండల పరిధిలో సుమారు 50కి పైగా ఇటుక బట్టీలు ఉన్నాయి. ముఖ్యంగా తుమ్మపాల, వెంకుపాలెం, సీతానగరం, తగరంపూడి, సీతయ్యపేట, పిసినికాడ, కశింకోట, మునగపాక, తోటాడ తదితర ప్రాంతాల్లో పెద్ద ఎత్తున ఇటుక బట్టీలు నిర్వహిస్తున్నారు. వీటిలో 90 శాతానికి పైగా ఎలాంటి అనుమతులు లేకుండానే ఏర్పాటు చేశారు. అనుమతులున్నవి వేళ్ల మీద లెక్కించవచ్చు. ఇలా అనుమతులు తీసుకున్నవారు కూడా నిబంధనలు ఉల్లంఘించి పెద్ద ఎత్తున అక్రమాలకు పాల్పడుతున్నారు. ధనార్జనే ధ్యేయంగా ఇటుకలను వారికి నచ్చిన ధరకు అమ్ముకుని లాభపడుతున్నారు.

భారీగా నాలా పన్ను ఎగవేత

వ్యవసాయ భూముల్లో ఏవైనా వాణిజ్య కార్యకలాపాలు నిర్వహిస్తే ఆ భూములను తప్పనిసరిగా వ్యవసాయేతర భూములుగా మార్పిడి చేసుకోవాలి. ఇందుకోసం నిర్ణీత నాలా పన్ను చెల్లించి రెవెన్యూ అధికారుల నుంచి భూ బదలాయింపు ధ్రువీకరణ పొందాలి. కానీ ఏ బట్టీ నిర్వాహకుడూ ఇలా చేయడానికి ఇష్టపడట్లేదు. దీంతో ప్రభుత్వ ఆదాయానికి భారీగా గండి పడుతోంది. బట్టీల యజమానులు గ్రామ పంచాయతీలకు చెల్లించాల్సిన సెస్సు కూడా ఎగవేస్తున్నారు. తమ కళ్ల ముందే ఈ తతంగం జరుగుతున్నా అధికారులు ఏదైనా ఫిర్యాదొస్తేనే స్పందిస్తున్నారు. లేకుంటే ఉదాసీనంగా వ్యవహరిస్తున్నారన్న విమర్శలు వినిపిస్తున్నాయి.

వెంకుపాలెం బట్టీకి రూ.40 లక్షలు జరిమానా!

మండలంలోని వెంకుపాలెం వద్ద ఓ ఇటుక బట్టీ నిర్వాహకుడు శారదానదీ గర్భం నుంచి భారీగా మట్టిని తరలించుకు పోతుండటంపై స్థానికులు అధికారులకు ఫిర్యాదు చేశారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఇటీవల అనకాపల్లి ఆర్డీవో చిన్నికృష్ణ, తహసీల్దార్ గంగాధరరావు తదితరులు విచారణ జరిపారు. నిబంధనలు ఉల్లంఘించి, పెద్ద ఎత్తున అక్రమాలకు పాల్పడుతున్నట్టు గుర్తించారు. ఈ మేరకు నివేదిక రూపొందించి, బట్టీ యజమానికి రూ.40 లక్షలు జరిమానా విధించాలని ఉన్నతాధికారులకు సిఫార్సు చేశారు. దీంతో సహజ వనరుల దోపిడీకి పాల్పడుతున్న బట్టీ నిర్వాహకుల్లో అలజడి మొదలైంది.

నిబంధనలు

- ఇటుక బట్టీ ఏర్పాటుకు రెవెన్యూ, పంచాయతీ, గనుల శాఖ, కార్మిక శాఖ, పరిశ్రమల శాఖ, అగ్నిమాపక శాఖ, విద్యుత్, అటవీ శాఖ, వాణిజ్య పన్నుల శాఖ, కాలుష్య నియంత్రణ మండలి నుంచి అనుమతులు ఉండాలి. కానీ నిర్వాహకులు అనుమతులు లేకుండానే నిర్వహిస్తున్నారు.
- బట్టీలలో ఇతర రాష్ట్రాల నుంచి రప్పించిన బాల కార్మికులు, మహిళలను తక్కువ వేతనాలకు నియమిస్తున్నారు. వృత్తి పన్ను మాత్రమే చెల్లించి సరిపెడుతున్నారు.
- ఇటుకల తయారీకి ఎక్కడి నుంచి మట్టి తీస్తారు.ఎంత లోతు తీయాలి అనేదానిపై ముందుగానే వివరించి శాఖా పరమైన అనుమతులు తీసుకోవాలి. సొంత పొలంలో మట్టిని తవ్వినా అనుమతులు తీసుకోవాలి. గనుల శాఖకు చలానా రూపంలో నిర్ణీత రుసుం చెల్లించాలి.
- ఇటుక బట్టీల్లో విద్యుత్ సౌకర్యం కోసం కమర్షియల్ మీటర్ మాత్రమే ఉండాలి.
- కలప రవాణాకు అటవీ అధికారుల అనుమతి తీసుకోవాలి. అలాగే కలప ఎక్కడి నుంచి, ఎంత తెస్తున్నారో తెలిపి, ఆ మేరకు చలానా తీయాలి.

చర్యలు తీసుకుంటాం



మండలంలోని పలు ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన ఇటుక బట్టీల నిర్వాహకుల్లో చాలా మంది ఏ విధమైన అనుమతులు తీసుకోలేదు.అనుమతులు లేకుండా సొంత పొలాల్లో అయినా బట్టీలు నిర్వహించకూడదు.అక్రమంగా మట్టి తవ్వకాలు చేపడితే కఠిన చర్యలు తీసుకుంటాం.సాగు భూముల్లో బట్టీలు ఏర్పాటు చేయాలంటే వ్యవసాయేతర భూమిగా మార్పు చేసుకోవాలి.

– గంగాధరరావు, తహసీల్దార్, అనకాపల్లి

నాణ్యతాలోపం లేకుండా కాలువల నిర్మాణం

- తుమ్మపాలలో డ్రైన్ పనులను పరిశీలించిన ఎంపీ సత్యవతి



తుమ్మపాల గుండాలవీధిలో డ్రైన్ పనులు పరిశీలిస్తున్న ఎంపీ సత్యవతి

అనకాపల్లి రూరల్ : అభివృద్ధి పనుల్లో నాణ్యతా లోపం లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలని అనకాపల్లి ఎంపీ భీశెట్టి వెంకట సత్యవతి సూచించారు. మండలంలోని తుమ్మపాల గుండాల వీధి సాయినగర్‌లో రూ.30 లక్షల ఎంపీ నిధులతో చేపట్టిన ప్రధాన కాలువ నిర్మాణ పనులను గురువారం ఆమె పరిశీలించారు. తుది దశకు చేరుకున్న పనులపై సంతృప్తి వ్యక్తం చేశారు. ఇంకా నిర్మించాల్సిన చిన్న కాల్వల్ని కూడా త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. డ్రైన్ నిర్మాణం పూర్తయితే సాయినగర్‌లో మురుగుకాల్వ సమస్య దాదాపుగా పరిష్కారమవుతుందని ఎంపీ అభిప్రాయపడ్డారు. స్థానిక ప్రజా ప్రతినిధుల వినతి మేరకు హిందూ శ్మశాన వాటిక ప్రహరీ నిర్మాణానికి రూ.5 లక్షలు మంజూరు చేయనున్నట్టు ఎంపీ తెలిపారు. వెంటనే ఈ పనులు ప్రారంభించాలని చెప్పారు. కార్యక్రమంలో తుమ్మపాల సర్పంచ్ తట్టా పెంటయ్యనాయుడు, ఆడారి సూరిబాబు, సచివాలయ కన్వీనర్ కోటేశ్వరరావు, ఎస్ఈ నాగేశ్వరరావు, జేఈ శ్రీనివాసరావు, గ్రామపంచాయతీ ఈవో కె శ్రీనివాసరావు, స్థానిక వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

శరవేగంగా స్మార్ట్ సిటీ స్కూల్ పనులు

- జీవీఎంసీ ఇంజినీర్లతో పార్లమెంట్ పరిశీలకుడు దాడి రత్నాకర్



భవన నిర్మాణ మ్యాప్‌ను పరిశీలిస్తున్న రత్నాకర్, జీవీఎంసీ డీఈ దిలీప్‌కుమార్, కార్పొరేటర్ కొణతాల నీలిమ

అనకాపల్లిటౌన్ : విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని పాఠశాలల భవనాలను నిర్మించాలని వైఎస్సార్‌సీపీ పార్లమెంట్ పరిశీలకుడు దాడి రత్నాకర్ అన్నారు. గవరపాలెం సంతబయలులో స్మార్ట్‌సిటీ స్కూల్ భవన నిర్మాణ పనులను జీవీఎంసీ డీఈ దిలీప్‌కుమార్‌తో కలిసి గురువారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా రత్నాకర్ మాట్లాడుతూ ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో కూడిన విద్యను బడుగు, బలహీన వర్గాల విద్యార్థులకు అందించేందుకు రూ.78 లక్షలతో స్మార్ట్ సిటీ స్కూల్ భవన నిర్మాణం జరుగుతోందన్నారు. నిర్మాణ పనుల్లో నాణ్యతాలోపాలు లేకుండా చూడాలని అధికారులను సూచించారు. వేసవి సెలవులు పూర్తయ్యేలోగా నిర్మాణ పనుల్ని పూర్తి చేసి, భవనాన్ని విద్యార్థులకు అందుబాటులోకి తీసుకురావాలని కోరారు. కార్యక్రమంలో 80వ వార్డు కార్పొరేటర్ కొణతాల నీలిమ, వైఎస్సార్‌సీపీ నేతలు కొణతాల భాస్కర్, కర్రి అప్పాజీ, కొరుబిల్లి ఆరుద్ర, మద్దాల భీమేష్, రేబాక ఇంద్రకుమార్, వేగి పవన్‌కుమార్, కాంట్రాక్టర్ నరేందర్ తదితరులు పాల్గొన్నారు.

యాదవ విద్యార్థుల సంక్షేమానికి కృషి



బంధం వెంకటరమణ, సానబోయిన కిషోర్‌లను సత్కరిస్తున్న యాదవ సంఘం అధ్యక్షుడు వెంకటరావు

అనకాపల్లిటౌన్ : యాదవుల్లో విద్యార్థుల ఉన్నత చదువులకోసం శక్తివంచన లేకుండా కృషి చేస్తున్నట్లు యాదవ సంక్షేమ సంఘం నియోజకవర్గ అధ్యక్షుడు బోడి వెంకటరావు అన్నారు. స్థానిక గొల్లవీధి సీతారామ కల్యాణమండపంలో గురువారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సంఘం ఆధ్వర్యంలో పలు సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్టు తెలిపారు. ఈ ఏడాది పదోతరగతిలో ఉత్తమ ఫలితాలు సాధించిన సంఘ విద్యార్థులను సత్కరించేందుకు తీర్మానం చేసినట్టు తెలిపారు. అనంతరం అనకాపల్లి బార్ అసోసియేషన్‌లో కమిటీ సభ్యులుగా ఎన్నికైన సంఘ సభ్యులు బంధం వెంకటరమణ, సానబోయిన కిషోర్‌లను సత్కరించారు. కార్యక్రమంలో సంఘ పట్టణ అధ్యక్షుడు బర్నికాన శ్రీనివాసరావు, ప్రధాన కార్యదర్శి బొబ్బిలి గోవిందరావు, న్యాయవాదులు ఐతా సన్యాసిరావు, ఒమ్మి సన్యాసిరావు తదితరులు పాల్గొన్నారు.

సత్తెమ్మతల్లికి నీడ కరువు



నిరాశ్రయంగా రోడ్డు పక్కన చేరిన సత్తెమ్మతల్లి గుడి విగ్రహాలు

తుమ్మపాల : అనకాపల్లి మండలం శంకరం, బట్లపూడి సరిహద్దున శివారు గ్రామంగా ఉన్న సత్తెమ్మపేటలో సత్తెమ్మతల్లికి నిలువ నీడ లేకుండా పోయింది. ఆలయ విగ్రహాలు రోడ్డు పక్కన ఓ మూలన పడేశారు. నిన్న మొన్నటి వరకు మొక్కిన ప్రజలు కూడా సత్తెమ్మకు నీడ ఏర్పాటుచేసే ఆలోచన చేయడం లేదు. సత్తెమ్మపేట గ్రామం సత్తెమ్మతల్లి పుట్టుకతోనే మొదలైంది. అనకాపల్లి–సబ్బవరం రోడ్డుకు అనుకుని ఉన్న సత్తెమ్మ ఆలయాన్ని మూడేళ్ల క్రితం రోడ్డు విస్తరణలో భాగంగా తొలగించారు. ఆలయాన్ని కూల్చేసిన సిబ్బంది, ధ్వంసమైన విగ్రహాలను దిగువన గ్రామానికి వెళ్లే రోడ్డుపై వదిలేసి చేతులు దులిపేసుకున్నారు. అప్పటి నుంచి అమ్మవారి విగ్రహాలు రోడ్డు మీదే పడిఉన్నాయి. రోడ్డు పక్కన ప్రభుత్వ భూమి ఉన్నప్పటికీ అధికారులు ఆలయ నిర్మాణానికి సహకరించట్లేదని గ్రామస్తులు ఆక్షేపిస్తున్నారు. దీంతో ఆ భూమిని కొందరు వ్యక్తులు ఆక్రమించి భవనాలు నిర్మిస్తున్నట్లు ఆరోపిస్తున్నారు.

ఘనంగా ఏకాంబరేశ్వరుని ఆలయ ప్రతిష్టాపన



ఏకాంబరేశ్వరస్వామి ఆలయంలో దాడి రత్నాకర్

కశింకోట : మండలంలోని కన్నూరుపాలెం గ్రామంలో కొత్తగా నిర్మించిన కామాక్షి సమేత ఏకాంబరేశ్వరస్వామి ఆలయ ప్రతిష్టాపన మహోత్సవం గురువారం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా స్వామిర్లతోపాటు శ్రీలక్ష్మి గణపతి, సుబ్రహ్మణ్యేశ్వరస్వామి, శ్రీ మద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి, గోవిందమాంబ, సిద్ధయోగి విగ్రహాలను వేదమంత్రాల నడుమ ప్రత్యేక పూజలు నిర్వహించి ప్రతిష్ఠించారు. అనకాపల్లి వైఎస్సార్‌సీపీ పార్లమెంటు పరిశీలకుడు దాడి రత్నాకర్ ఆలయాన్ని సందర్శించి స్వామివార్లకు పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ నిర్వాహకులు రత్నాకర్‌ను దుశ్శాలువా కప్పి, జ్ఞాపికను అందించి సత్కరించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ ప్రతినిధులు వెదురువాడ సన్యాసి ఆచారి, మత్తుర్తి గంగారావు, కోటిపల్లి జేజిబాబు, మాజీ ఎంపీటీ సభ్యుడు వేగి దొరబాబు తదితరులు పాల్గొన్నారు.

వేసవి జాగ్రత్తలు తప్పనిసరి



పాదచారునికి మజ్జిగను అందిస్తున్న వైద్యుడు శ్యామ్‌సుందర్

అనకాపల్లిటౌన్ : పెరుగుతున్న వేసవి ఎండల దృష్ట్యా బయటకు వెళ్లేటపుడు తప్పనిసరిగా ప్రజలు తమ వెంట గొడుగులు తీసుకు వెళ్లాల్సిందిగా పట్టణ దంత వైద్యుడు శ్రీధరాల శ్యామ్‌సుందర్ సూచించారు. స్థానిక మెయిన్‌రోడ్డు దిశ పోలీస్ స్టేషన్ ఎదురుగా వాసవీక్లబ్ ఆధ్వర్యంలో ఉచిత మజ్జిగ చలివేంద్రాన్ని గురువారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మూడు రోజులుగా ఉష్ణోగ్రతల్లో మార్పులతో వడగాల్పులు వీస్తున్నాయన్నారు. సాధ్యమైన మేరకు ఉదయం, సాయంత్రం సమయాల్లో మాత్రమే బయట పనులు చూసుకోవాలన్నారు. ఎక్కువ ద్రవ పదార్థాలను తీసుకోవాలన్నారు. జంక్ ఫుడ్, మసాలాలకు తగ్గించుకోవాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షుడు తాటికొండ శ్రీనివాసరావు, కార్యదర్శి బొగ్గారపు మంగరాజు, కోశాధికారి నాగరాజు, సభ్యులు ఆరేపు కామేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

14న ఆంజనేయస్వామి జయంతికి ఏర్పాట్లు



సినిమాహాలు కూడలిలో వెలసిన పంచముఖ ఆంజనేయస్వామి

పరవాడ: స్థానిక సినిమాహాలు కూడలిలో కొలువుదీరిన పంచముఖ ఆంజనేయస్వామి జయంతిని ఈ నెల 14న నిర్వహించడానికి ఏర్పాట్లు పూర్తి చేసినట్లు శ్రీ పైడిమాంబ యూత్ కమిటీ ప్రతినిధి బొద్దపు అయ్యబాబు గురువారం తెలిపారు. ఆ రోజు వేకువ జాము నుంచి స్వామికి ప్రత్యేక హోమాలు పూజలు నిర్వహిస్తామన్నారు. పరవాడ పరిసర గ్రామాల భక్తులు స్వామి వారిని దర్శించుకునేందుకు ఏర్పాట్లు చేశామన్నారు. ఆలయ ప్రాంగణంలో ఆదివారం మధ్యాహ్నం భారీ అన్నసమారాధన నిర్వహించనున్నట్లు చెప్పారు. ఆ రోజు రాత్రికి ఆంజనేయ స్వామిని పుర వీధుల్లో ఊరేగిస్తారు. రాత్రికి పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశామని అయ్యబాబు వెల్లడించారు.

పెరిగిన అల్లం, జీలకర్ర ధరలు

కశింకోట : స్థానిక వారపు సంతలో గురువారం అల్లం దర్శనమిచ్చింది. గత వారం అల్లం హోల్‌సేల్‌గా కిలో రూ.200 కావడంతో వ్యాపారులు తీసుకురాలేదు. ఈ వారం మాత్రం అల్లం విరివిగా వచ్చినప్పటికీ ధర కిలో రూ.250కి చేరింది. ఇక జీలకర్ర కూడా మరింత ప్రియంగా మారింది. గత వారం కిలో రూ.530 ఉండగా, ఈ వారం రూ.600కు చేరింది. తగిన ఉత్పత్తి లేకపోవడమే దీనికి కారణమని వ్యాపారులు చెప్తున్నారు. సంతకు మామిడి పండ్లు ఎక్కువగా వచ్చాయి. బంగినపల్లి, సువర్ణరేఖ, పరియా తదితర రకాల మామిడి పండ్ల విక్రయాలు జోరుగా జరిగాయి. వీటిని పరిమాణం, రకం అనుసరించి డజన్ రూ.50 నుంచి రూ.400 వరకు విక్రయించారు. ఉదయం 11 నుంచి సాయంత్రం 4 వరకు ఎండ తీవ్రత ఎక్కువగా ఉండటంతో వ్యాపారులు, కొనుగోలుదారులు ఇక్కట్లకు గురయ్యారు. ఆ సమయంలో కొనుగోలుదారులు లేక సంత వెలవెలబోయింది. కూరగాయల ధరలు దాదాపు స్థిర అమ్మకాలు సాగాయి.

ప్రజాప్రతినిధుల క్రికెట్ టోర్నీ నేడు

కశింకోట : విశాఖలోని రైల్వే స్టేడియంలో శుక్రవారం ఉదయం 8 గంటలకు వైఎస్సార్ క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభం కానున్నట్టు ఎంపీపీ కలగా లక్ష్మి, ఉగ్గినపాలెం సర్పంచ్ కలగా గున్నయ్యనాయుడు గురువారం తెలిపారు. రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్య శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ ఆధ్వర్యంలో జరిగే టోర్నమెంటులో కశింకోట, అనకాపల్లి మండలాలు, అనకాపల్లి పట్టణం నుంచి మూడు జట్లను ఏర్పాటు చేసి, టోర్నమెంట్ నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. టోర్నీలో పాల్గొనేందుకు మండలంలోని సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, వైఎస్సార్‌సీపీ శ్రేణులు, క్రికెట్ ఆటలో ప్రవేశం ఉన్న గ్రామ స్థాయి నాయకులు, ఆటగాళ్లను ప్రోత్సహించేందుకు పార్టీ అభిమానులు హాజరుకావాల్సిందిగా కోరారు.

ఆత్మహత్యకు యత్నించిన వ్యక్తి ఆస్పత్రిలో మృతి



ఆస్పత్రి వద్ద ధర్నా చేస్తున్న మణి కుటుంబ సభ్యులు

అనకాపల్లి టౌన్ : ఆత్మహత్యకు పాల్పడిన వ్యక్తి చికిత్స పొందుతూ ప్రైవేట్ ఆస్పత్రిలో గురువారం మృతి చెందాడు. స్థానికులు, కుటుంబ సభ్యుల కథనం మేరకు వివరాలు.. మునగపాక మండలం మునగపాక గ్రామానికి చెందిన మళ్ల సంతోష్ కిరణ్ మణి(39) అప్పుల బాధ పడలేక ఈ నెల 8న తన స్వగృహంలో పురుగుల మందు సేవించి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. విషయం తెలుసుకున్న కుటుంబ సభ్యులు హుటాహుటిన అనకాపల్లిలోని ప్రైవేట్ ఆస్పత్రికి తీసుకెళ్లారు. అక్కడ చికిత్స పొందుతూ గురువారం రాత్రి మణి మృతి చెందాడు.

వైద్యుల నిర్లక్ష్యమే కారణం

వైద్యుల నిర్లక్ష్యం కారణంగా మణి మృతి చెందాడని ఆరోపిస్తూ కుటుంబ సభ్యులు ఆస్పత్రి వద్ద టెంట్‌వేసి నిరసనకు దిగారు. విషయం తెలుసుకున్న పట్టణ ఎస్ఐలు దివాకర్, సింహాచలంలు ఇరువర్గాలతో మాట్లాడారు. వివాదాన్ని సద్దుమణిగించడానికి ప్రయత్నించారు. అర్ధరాత్రి దాటినా ఆస్పత్రి యాజమాన్యానికి, మృతుని బంధువులకు మధ్య చర్చలు కొనసాగుతూనే ఉన్నాయి. మృతుడు మణికి భార్య మంజు, ఇద్దరు పిల్లలు హారిక, రూపేష్‌లు ఉన్నారు.

పేదింటి చదువుల సరస్వతులు



కశింకోటలోని డీపీఎన్ జెడ్పీ హైస్కూల్

కశింకోట : పేదింటి పిల్లలు. సర్కారీ స్కూల్ విద్యార్థులు. ఇటీవల విడుదలైన పదో తరగతి ఫలితాల్లో సత్తా చాటారు. మండలంలో 576 మార్కులతో మండల టాపర్లుగా నిలిచారు. కశింకోటలోని డీపీఎన్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చదివిన డోకుల బిందు, కొవ్వాడ మోక్షిత అత్యధిక మార్కులతో మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో టాపర్లుగా నిలిచి, పలువురి అభినందనలు అందుకున్నారు.

ప్రణాళికాయుత బోధన

పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఎ.శ్రీధర్‌రెడ్డి ఆధ్వర్యంలో ఉపాధ్యాయ బృందం పదో తరగతి విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ కనబరిచింది. మూడు మాసాల ముందే సిలబస్ పూర్తి చేసి, పునఃశ్చరణ తరగతులపై దృష్టి సారించారు. పాత పరీక్షా పేపర్ల సాధన చేయించారు. గణితం, సైన్స్, సోషల్ సబ్జెక్టుల్లో డయాగ్రామ్‌లు, గ్రాఫ్‌లు, మ్యాప్‌లపై సులభ పద్ధతిలో అర్థమయ్యేలా పదేపదే బోధించారు. ప్రభుత్వం అందించిన సౌకర్యాలు, స్టడీ మెటీరియల్, ఉన్నతాధికారుల చొరవ, ప్రత్యేక పర్యవేక్షణ వల్లే ఇంతటి ఫలితాలు సాధించగలిగినట్లు విద్యార్థులు తెలిపారు. ఉపాధ్యాయుల ప్రోత్సాహం, వారిచ్చిన గైడెన్స్ ఎప్పటికీ మర్చిపోలేమని పేర్కొన్నారు.

ఇద్దరిదీ చెరో నేపథ్యం

డోకుల ఆదినారాయణ, నాగమణి దంపతుల ఇద్దరు ఆడపిల్లల్లో బిందు పెద్దమ్మాయి. వీరికి 20 సెంట్ల భూమి మాత్రమే ఉంది. కుటుంబ పోషణకు తండ్రి కౌలుకు భూమి తీసుకుని సాగు చేస్తుంటాడు. దీంతో పాటు రెండు పాడి గేదెలున్నాయి. తల్లి నాగమణి వీటి ఆలనాపాలనా చూస్తుంది. ప్రైవేట్ పాఠశాలలో చదివించే స్తోమత లేక ప్రభుత్వ పాఠశాలలో చదివించారు. అయినా బిందు మంచి మార్కులు సాధించింది. కంచిపాటి వీధికి చెందిన కొవ్వాడ మోక్షిత తండ్రి సత్తిబాబు వ్యవసాయంతోపాటు, చిరువ్యాపారం చేస్తుంటాడు. తల్లి సీనియర్ సివిల్ జడ్జి కోర్టులో ప్రాసెస్ సర్వర్. వీరికి కూడా ఇద్దరు ఆడ పిల్లలు. పెద్దమ్మాయి మేఘవర్ష నాగార్జున యూనివర్సిటీలో ఫ్రీ సీటు సాధించి బీటెక్ చేస్తోంది.

ఇంజినీర్ కావడమే ధ్యేయం



తొలుత 550 మార్కులు దాటాలన్న లక్ష్యంతో చదివా. పరీక్ష రాశాక అంతకు మించిన మార్కులు వస్తాయనుకున్నా. నా చేతిరాత పెద్దగా బాగోదు. దీని వల్ల కొన్ని మార్కుల తగ్గాయనుకుంటా. లేకుంటే ఇంకా మంచి మార్కులు వచ్చేవి. టీచర్లు చాలా ప్రోత్సహించారు. ఇంజినీర్ అవ్వాలన్నది నా కోరిక. దాని కోసం ఇంకా బాగా చదవి, భవిష్యత్తులో మరింత మంచి మార్కులు సాధిస్తా.

– డోకుల బిందు


అక్క చూపిన బాటలో..



అక్క మేఘవర్ష చూపిన బాటలో ట్రిపుల్ ఐటీలో సీటు సాధించి, ఇంజినీరింగ్ చేయాలన్నది నా కల. తల్లిదండ్రుల ప్రోత్సాహంతోపాటు, ఉపాధ్యాయుల సహకారం మర్చిపోలేనిది. 11 పేపర్ల నుంచి ఆరుకు తగ్గించినపుడు పరీక్ష రాసేందుకు సమయం సరిపోదనుకుని భయపడ్డా. హెచ్‌ఎంతోపాటు, సబ్జెక్టు టీచర్లు ముందు నుంచీ ప్రణాళికాయుతంగా చదివించారు. అదే ఈ స్థాయి మార్కులకు కారణం.

– కొవ్వాడ మోక్షిత

ఉత్సాహంగా మ్యూజికల్ చైర్ పోటీలు



మ్యూజికల్ చైర్ పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు

సబ్బవరం: సబ్బవరం శాఖా గ్రంథాలయంలో గురువారం విద్యార్థులకు పుస్తక పఠనంపై అవగాహన కల్పించారు. గ్రంథాలయ అధికారి శిరీష విద్యార్థులతో కథల పుస్తకాలు చదివించారు. అనంతరం నిర్వహించిన మ్యూజికల్ చైర్ పోటీల్లో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని ప్రతిభ చూపారు. సబ్బవరంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల, ప్రాథమిక పాఠశాలల విద్యార్థులు పాల్గొన్నారు.